జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

రంగారెడ్డి | ఆదివారం 15 మార్చి 2026 | సంపుటి : 1 | సంచిక : 72 | వెల: రూ.5 | పేజీలు: 08 | RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పుర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from RANGAREDDY, WARANGAL, KAMMAM, NALAGONDA | http://www.prajajyothinews.com | Mail: prajajyothidaily@gmail.com

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు 9440231967, 7989694528

## మే 11 నుంచి తొలిదశ

# జనాభా లెక్కలు

- ప్రభుత్వ పనితీరు మెరుగుపడేందుకు జనగణనే కీలకం
- తెలంగాణ ఏర్పడ్డాక తొలిసారి జనగణన
- రాష్ట్రంలో 11 మే నుంచి జూన్ 09 వరకు తొలిదశ లెక్కింపు
- డిజిటల్ మోడ్‌లో జనగణన చేపట్టేందుకు ఆఫ్‌లైన్ మోడ్‌లో పనిచేసే యాప్ వినియోగం



అన్ని శాఖల్లో పురోగతి రావాలన్నా, అభివృద్ధి జరగాలన్నా, ప్రభుత్వం ఉపయోగకరమైన పాలసీలు చేయాలన్నా ముఖ్యమైనది జనగణన మాత్రమేనని జనగణన డైరెక్టర్ భారతి హోళికేరి పేర్కొన్నారు. 2026 మే 11 నుంచి తొలిదశ జనాభా లెక్కలు ప్రారంభం కానున్న నేపథ్యంలో మీడియా ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు అవగాహన కల్పించడంలో మీడియా వారధిగా పని చేస్తోందని జనాభా లెక్కల విషయంలోనూ అదే విధంగా కృషి చేయాలని కోరారు. హైదరాబాద్ కోఠిలోని సెన్సస్ కార్యాలయంలో డైరెక్టర్ భారతి హోళికేరి ప్రెస్ మీట్ నిర్వహించారు. జనాభా లెక్కలు జరగనున్న విధానంపై మీడియా ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. 1872లో తొలిసారి జనాభాను బ్రిటిష్ కాలంలో లెక్కించారని, తర్వాత 1881లో తొలిసారి - మిగతా3లో



## ఎన్డీఏ కూటమితో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదు

- ఎన్డీఏతో పొత్తుపై స్పష్టత ఇచ్చిన టీవీకే
- కూటమితో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదన్న స్పష్టం
- పొత్తుపై జరుగుతున్న చర్చంతా ఊహాగానాలేనంటూ కొట్టిపారేసిన పార్టీ

## మూసీలో మంచినీరు పారేలా చేస్తామంటే విపక్షాలు అడ్డుకోవడమేంటి

- హయత్‌నగర్‌లో రోడ్డు విస్తరణ పనులకు మంత్రి కోమటిరెడ్డి శంకుస్థాపన
- విజయవాడ హైవే కోకాపేట్‌కు మించి అభివృద్ధి చెందుతుందన్న మంత్రి
- మూసి పునరుజ్జీవనం చేయాలని వెల్లడి



హైదరాబాద్

హయత్ నగర్, ఇబ్రహీం పట్నం, ఎల్బీనగర్ వాసులకు హైదరాబాద్ - విజయవాడ రహదారి విస్తరణతో కోకాపేట లాంటి డిమాండ్ రాబోతుందని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ సిటీగా ఫ్యూచర్ సిటీనీ నిర్మిస్తున్నామని, ఇక్కడ నుండే చెన్నై, బెంగళూరు, ముంబై పూణెను కలుపుతూ హై స్పీడ్ బుల్లెట్ ట్రైన్, హైవే కారిడార్లు రాబోతున్నాయని అన్నారు. హయత్ నగర్ సాయిబాబా టెంపుల్ (తొర్రూర్ ఇ రోడ్) నుంచి జీ స్కూల్ వరకు సుమారు రూ.10 కోట్ల అంచనా వ్యయంతో 2లేన్ నుంచి 4లేన్ రహదారిగా అభివృద్ధి చేస్తున్న పనులకు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఇవాళ శంకుస్థాపన చేశారు. - మిగతా3లో

## భారత నౌకలకు హోర్ముజ్ జలసంధి మీదుగా వెళ్లేందుకు అనుమతి

- హోర్ముజ్ జలసంధి ద్వారా భారత నౌకలకు సురక్షిత మార్గం కల్పిస్తామన్న ఇరాన్
- ఈ విషయాన్ని ధ్రువీకరించి భారత్‌లోని ఇరాన్ రాయబారి
- 'భారత ప్రభుత్వానికి సహకారం అందిస్తాం' : ఇరాన్ రాయబారి



## లూజ్‌గా పెట్రోల్ అమ్మొద్దు..

- బంకులకు కేంద్రం వార్నింగ్
- దేశవ్యాప్తంగా అన్ని పెట్రోల్ బంకుల్లో ఇంధన నిల్వలు పుష్కలంగా ఉన్నాయి
- ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
- దేశంలోని అన్ని రిటైల్ అవుట్‌లెట్లు, డీలర్లకు కఠిన ఆదేశాలు జారీ




## ఎల్పీజీ సరఫరాలో ఇబ్బందులు లేవు

- బుకింగ్ చేసుకున్న అందరికీ గ్యాస్ వస్తుంది: కేంద్రం
- సిలిండర్ల బ్లాక్‌మార్కెట్ అరికట్టాలని రాష్ట్రాలను కోరాం
- వాణిజ్య సిలిండర్ల విషయంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నాం
- కేంద్రప్రభుత్వం వివరణ





## కాంగ్రెస్ విదేశీ శక్తుల కీలుబొమ్మ

- ప్రధాని నరేంద్ర మోదీ
- 'ప్రస్తుతం ప్రపంచమంతటా యుద్ధ వాతావరణం నెలకొంది
- ఇటువంటి క్లిష్ట సమయంలో దేశ ప్రజలపై ఆ ప్రభావం పడకుండా తమ ప్రభుత్వం శక్తివంచన లేకుండా కృషి చేస్తోంది
- అయితే బాధ్యతాయుతమైన రాజకీయ పక్షంగా వ్యవహరించాల్సిన కాంగ్రెస్.. దేశంలో అలజడి సృష్టించేందుకు ప్రయత్నిస్తోంది




## డొమెస్టిక్ సిలిండర్ల కోసం

# ఆందోళన అవసరం లేదు

- తెలంగాణ పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి
- డొమెస్టిక్ సిలిండర్ల పంపిణీలో ఎలాంటి ఇబ్బందీ లేదు
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కమిటీ, జిల్లా స్థాయిలో కలెక్టర్ల ఆధ్వర్యంలో కమిటీలు ఏర్పాటు

హైదరాబాద్

ఎల్‌పీజీ సిలిండర్ల పంపిణీలో వినియోగదారులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపడుతున్నామని తెలంగాణ పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. డొమెస్టిక్ సిలిండర్ల పంపిణీలో ఎలాంటి ఇబ్బందీ లేదన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కమిటీ, జిల్లా స్థాయిలో కలెక్టర్ల ఆధ్వర్యంలో కమిటీలు ఏర్పాటు - మిగతా3లో

## అడగడుగునా అడ్డంకులు...

# ముందుకు సాగేదెలా

- 500 మంది నిపుణులు, ప్రజాప్రతినిధులతో నిర్వహించే పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఈ ప్రాజెక్టు భవితవ్యాన్ని నిర్ణయించబోయే ఒక కీలక మలుపు
- బాధితుల్లో ఉన్న భయాన్ని తొలగించేందుకు నేరుగా ముఖ్యమంత్రే హామీ ఇస్తున్నారు అనే నమ్మకాన్ని కలిగించడం దీని ప్రధాన ఉద్దేశం
- సాధారణంగా ఇలాంటి ప్రాజెక్టుల వివరణను అధికారులు లేదా కన్సల్టెంట్లు ఇస్తారు
- కానీ మూసీ ప్రాజెక్టు విషయంలో సీఎం స్వయంగా వివరణ ఇవ్వాలని నిర్ణయించుకోవడం వెనుక బలమైన రాజకీయ, పరిపాలనాపరమైన వ్యూహం ఉంది



హైదరాబాద్

హైదరాబాద్ నగరాన్ని అంతర్జాతీయ స్థాయికి చేర్చాలనే రేవంత్ రెడ్డి సర్కార్ సంకల్పంలో 'మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్' కీలకమైనది. అయితే, ప్రారంభం నుంచీ ఈ ప్రాజెక్టు విమర్శలు, రాజకీయ వివాదాలు, నిర్వాసితుల ఆందోళనల మధ్య నలిగిపోతోంది. ఈ నేపథ్యంలో, అపోహలను తొలగించి, ప్రాజెక్టు పారదర్శకతను చాటిచెప్పేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా రంగంలోకి దిగారు. 500 మంది నిపుణులు, ప్రజాప్రతినిధులతో నిర్వహించే పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఈ ప్రాజెక్టు భవితవ్యాన్ని నిర్ణయించబోయే ఒక కీలక మలుపు. సాధారణంగా ఇలాంటి ప్రాజెక్టుల వివరణను అధికారులు లేదా కన్సల్టెంట్లు ఇస్తారు. కానీ మూసీ ప్రాజెక్టు విషయంలో సీఎం స్వయంగా వివరణ ఇవ్వాలని నిర్ణయించుకోవడం వెనుక బలమైన రాజకీయ, పరిపాలనాపరమైన వ్యూహం ఉంది. బఫర్ జోన్ పరిధిలోని - మిగతా3లో



## పంజాబ్ ప్రభుత్వం కేజ్రీవాల్‌కు ఏటీఎంలా మారిపోయింది

- భగవంత్ మాన్ ప్రభుత్వంపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా తీవ్ర విమర్శలు
- పంజాబ్ అప్పులు, మాదకద్రవ్యాలు, మత మార్పిడులు, అవినీతి నిలయంగా మారిందంటూ ఘాటు వ్యాఖ్యలు
- "ఈ ప్రభుత్వంలో శాంతిభద్రతల పరిస్థితి దారుణంగా ఉంది
- 2026లో ముగ్గురు గ్రామ సర్పంచులు హత్యకు గురయ్యారు

# పంజాబ్ ప్రభుత్వం కేజ్రీవాల్‌కు ఏటిఎంలా మారిపోయింది

పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ ప్రభుత్వంపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా తీవ్ర విమర్శలు గుప్పించారు. భగవంత్ మాన్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని, ఆ పార్టీ అగ్రనేత అరవింద్ కేజ్రీవాల్‌కు ఒక ఏటిఏంలా మారిపోయిందని షా ఆరోపించారు. అప్పులు, డ్రగ్స్, అక్రమ మత మార్పిడులు, అవినీతి, గ్యాంగ్‌స్టర్ల అరాచకాలతో పంజాబ్ నాశనమైందన్నారు. మాదకద్రవ్యాల సమస్య నుంచి రాష్ట్రాన్ని విముక్తి చేయగలిగే శక్తి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బీజేపీకి మాత్రమే ఉందన్నారు. శనివారం పంజాబ్‌లోని మోగా జిల్లా, కిల్లి చాహ్లాన్ గ్రామంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో అమిత్ షా పాల్గొని మాట్లాడారు. పంజాబ్ ప్రజలు గతంలో కాంగ్రెస్ పార్టీకి, శిరోమణి అకాలీదళ్, ఆమ్ ఆద్మీ పార్టీకి అవకాశాలు ఇచ్చారని షా గుర్తు చేశారు. 2027లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే మాదకద్రవ్యాల వ్యాపారాన్ని సమూలంగా నిర్మూలిస్తామని ఆయన హామీ ఇచ్చారు.



"ఈ ప్రభుత్వంలో శాంతిభద్రతల పరిస్థితి దారుణంగా ఉంది. 2026లో ముగ్గురు గ్రామ సర్పంచులు హత్యకు గురయ్యారు. గ్యాంగ్‌స్టర్లు ప్రజల నుంచి బలవంతంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. అదేవిధంగా, రాష్ట్రం పూర్తిగా మాదకద్రవ్యాల ముప్పుతో సతమతమౌతోంది. రైతులు కూడా ఎన్నో విధాలుగా నష్టపోతున్నారు. మరోవైపు, ప్రభుత్వం పూర్తిగా అవినీతిలో మునిగిపోయింది. దిల్లీ నుంచి వచ్చిన నలుగురు సుబేదార్లు, రాష్ట్రంలో కూర్చొని సంపదనంతా బయటకు తరలిస్తున్నారు. భగవంత్ మాన్ కేవలం కేజ్రీవాల్‌కు పైలట్‌గా మాత్రమే వ్యవహరిస్తున్నారు."

### మాదకద్రవ్యాల వ్యాపారాన్ని అంతం చేసే ధైర్యం వారికి లేదు!

మరోవైపు, రాష్ట్రంలో శాంతిభద్రతల గురించి షా ప్రస్తావించారు. రాష్ట్రంలో మాదకద్రవ్యాల ముప్పును అంతం చేసే ధైర్యం 'ఆప్'నకు లేదని, దాన్ని అరికట్టడంలో కాంగ్రెస్, అకాలీలు ఇప్పటికే విఫలమయ్యాయని విమర్శించారు. అయితే వాటిని రాష్ట్రం నుంచి పూర్తిగా తొలగించగలిగే వారు ఎవరైనా ఉన్నారంటే, అది కేవలం నరేంద్ర మోదీ ప్రభత్వమేనని షా వ్యాఖ్యానించారు. ఎందుకంటే, తమ ప్రభుత్వం హయాంలో జమ్ము కశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు చేశామని, ఉగ్రవాదం కూడా చివరి దశలో ఉందని, నక్సలిజం నేడు అంతిమ దశకు చేరుకుందని షా పేర్కొన్నారు. కాబట్టి, రాబోయే ఎన్నికల్లో తమను గెలిపిస్తే రెండేళ్లలో పంజాబ్‌లో మాదకద్రవ్యాల వ్యాపారాన్ని సమూలంగా నిర్మూలిస్తామని షా హామీ ఇచ్చారు.

### హామీలను నెరవేర్చిందా?

మరోవైపు, రాష్ట్రంలో నెలకొన్న ప్రతికూల పరిస్థితుల కారణంగా పరిశ్రమలు పంజాబ్‌ను విడిచిపెట్టి వెళ్లిపోతున్నాయని, ఫలితంగా నిరుద్యోగులు పెరుగుతున్నారని షా వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో మాన్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను (అన్ని పంటలకు కనీస మద్దతు ధర కల్పించడం, వృద్ధాప్య పెన్షన్ మొత్తాన్ని పెంచడం) నెరవేర్చిందా అని ఆయన ప్రశ్నించారు.
ఇదిలా ఉండగా, 2027లో పంజాబ్‌లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అమిత్ షా మాట్లాడారు. ప్రజలు తమకు ఒక్క అవకాశం ఇస్తే అంతా మార్చి చూపిస్తామన్నారు. గతంలో అకాలీదళ్ సర్కార్‌లో బీజేపీ భాగస్వామిగా ఉన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఇప్పుడు పంజాబ్ ప్రజల ఆశీస్సులు తీసుకునేందుకే తాను ఇక్కడికి వచ్చానని చెప్పారు. మోగా ప్రాంతం పంజాబ్‌లోని రాజకీయంగా అత్యంత కీలకమైన 'మల్వా బెల్ట్' పరిధిలోకి వస్తుంది. వచ్చే ఏడాది ప్రారంభంలో ఎన్నికలు జరగనున్న రాష్ట్ర అసెంబ్లీలోని మొత్తం 117 స్థానాల్లో, 69 స్థానాలు ఈ మల్వా బెల్ట్ పరిధిలోనే ఉన్నాయి.

# ఎల్పీజీ సరఫరాలో ఇబ్బందులు లేవు

ఎల్పీజీ సరఫరాలో ప్రస్తుతానికి ఇబ్బందులు లేవని కేంద్ర ప్రభుత్వం మరోసారి తెలిపింది. సిలిండర్ల విషయంలో చాలామంది ఆందోళన చెందుతున్నారని, చాలామంది అవసరం లేకున్నా బుకింగ్ చేస్తున్నారని చెప్పింది. వాణిజ్య సిలిండర్ల విషయంలో రాష్ట్రాలతో మాట్లాడుతున్నామని, ప్రాధాన్య క్రమంలో సరఫరా చేస్తున్నామని స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర విదేశాంగ శాఖ ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్?ల్ భారత చమురు శాఖ సంయుక్త కార్యదర్శి(మార్కెటింగ్, ఆయిల్ రిఫైనరీ) సుజాత శర్మ పలు వివరాలు వెల్లడించారు. ఏపీలో వారిపై చర్యలు "సిలిండర్ల బ్లాక్‌మార్కెట్ అరికట్టాలని రాష్ట్రాలను కోరాం. వాణిజ్య సిలిండర్ల విషయంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నాం. సిలిండర్లు అక్రమంగా నిల్వ చేసిన వారిపై చర్యలు తీసుకుంటున్నాం. ఏపీ, బిహార్, కర్ణాటక, ఒడిశాలో వాణిజ్య సిలిండర్లు నిల్వ చేసిన వారిపై చర్యలు తీసుకున్నాం. ఎల్పీజీ సరఫరాలో గృహాలు, ఆస్పత్రులు, హాస్టళ్లకు ప్రాధాన్యం ఇస్తున్నాం. సిలిండర్ బుక్ అవడం లేదని చాలామంది ఫిర్యాదు చేస్తున్నారు. సిలిండర్ల బుకింగ్ వ్యవధి పట్టణాల్లో 25, గ్రామాల్లో 45 రోజులుగా ఉంది. సిలిండర్ల బుకింగ్ ఫోన్, ఐవీఆర్ఎస్, ఇతర విధానాల్లో చేయవచ్చు. డిస్ట్రిబ్యూటర్ల వద్దకు వెళ్లి క్యూలో ఉండనక్కర్లేదు. సిలిండర్ల అందుబాటు మేరకు సరఫరా జరుగుతూనే ఉంది. బుకింగ్ చేసుకున్న అందరికీ గ్యాస్ వస్తుంది" అని సుజాత శర్మ తెలిపారు.



### ఆ రెండు నౌకలు ఎప్పుడు వస్తాయంటే?

"పశ్చిమ గల్ఫ్‌లోని హర్మూజ్ వద్ద 24 నౌకలు ఉన్నాయి. ఎల్‌పీజీ సరఫరా చేసే 2 నౌకలు హర్మూజ్ నుంచి బయలుదేరాయి. శివాలిక్, నందాదేవి నౌకల్లో ఎల్‌పీజీ తరలింపు జరుగుతోంది. రెండు నౌకలు ఈనెల 16, 17 తేదీల్లో ముంద్రా, కాండ్లా పోర్టులకు వస్తున్నాయి. గల్ఫ్‌లో ఉన్న భారతీయ నౌకలు క్షేమంగానే ఉన్నాయి. నౌకల్లో ఉన్న భారత సిబ్బందికి ఎలాంటి సమస్యలు లేవు. హర్మూజ్ జలసంధిలో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాం. భారత నావికుల కుటుంబసభ్యులకు ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తున్నాం. గడిచిన 24 గంటల్లో 30 మంది నావికులు స్వదేశానికి తరలివచ్చారు. పోర్టుల్లో సమస్యలు రాకుండా చూడాలని అధికారులను కోరాం" అని చెప్పారు. ఆ తర్వాత శివాలిక్, నందాదేవి నౌకలు సుమారు 92,700 మెట్రిక్ టన్నుల ఎల్పీజీతో దేశానికి వస్తున్నాయని షిప్పింగ్ మంత్రిత్వ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్ కుమార్ సిన్హా తెలిపారు. మార్చి 16, 17 తేదీల్లో రావొచ్చని తెలిపారు. "పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలోని భారతీయ నావికులందరూ సురక్షితంగా ఉన్నారు. గత 24 గంటల్లో వారికి సంబంధించిన ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు. హోర్మూజ్ జలసంధికి పశ్చిమాన ఉన్న పర్షియన్ గల్ఫ్‌లో 24 భారతీయ జెండాతో కూడిన నౌకలు ఉన్నాయి. మొత్తం 611 మంది నావికులు ఉన్నారు" అని ఆయన చెప్పారు. భారతీయ సిబ్బంది భద్రతను నిర్ధరించడానికి ఓడ యజమానులతో సన్నిహిత సమన్వయంతో పనిచేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. "భారతీయ నౌకలు, అందులోని భారతీయ నావికుల పరిస్థితిని మంత్రిత్వ శాఖ, ముఖ్యంగా డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ (ఆ+ షిప్పింగ్), ఓడ యజమానులు, రాంచీ ఏజెన్సీలు, భారత దౌత్య కార్యకలాపాల సమన్వయంతో నిశితంగా పర్యవేక్షిస్తోంది. గత 24 గంటల్లో, షిప్పింగ్ కమ్యూనికేషన్ సెంటర్ అయిన ఆ+ కామ్ 312 ఫోన్ కాల్స్, 460 ఈమెయిల్స్‌ను అందుకుంది. ఆ కమ్యూనికేషన్‌లు నావికులు, వారి కుటుంబ సభ్యులు, సముద్ర రంగంలోని ఇతర వాటాదారుల నుంచి వచ్చాయి. గత 15 రోజులను పరిశీలిస్తే, మాకు 2,500 కంటే ఎక్కువ ఫోన్ కాల్స్, సుమారు 5,000 ఈమెయిల్స్ వచ్చాయి, వీటన్నింటికీ తగిన విధంగా స్పందన ఇచ్చాం" అని ఆయన చెప్పారు.

# ఎన్‌డీఏ కూటమితో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదు

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ త్వరలో ప్రకటించే అవకాశం ఉన్న నేపథ్యంలో రాష్ట్రంలో రాజకీయ చర్చలు వేడెక్కాయి. ముఖ్యంగా దళపతి విజయ్ నేతృత్వంలోని తమిగళ వెట్రి కజగంపైనే అందిరి దృష్టి నెలకొంది. అన్నాడీఎంకే నేతృత్వంలోని ఎన్?డీఏతో పొత్తు ఉంటుందని వార్తలు వస్తోన్న ఈ క్రమంలో విజయ్ పార్టీ క్లారిటీ ఇచ్చింది. ఎన్?డీఏ కూటమితో పొత్తుకు ఎటువంటి ఆస్కారం లేదని స్పష్టం చేసింది. ఈ విషయమై జరుగుతున్న చర్చలు కేవలం ఊహాగానాలు మాత్రమే అని కొట్టిపారేసింది.
టీవీకే జిల్లా కార్యదర్శులతో జరిగిన వర్చువల్ సమావేశంలో పార్టీ బలాబలాలు సహా పొత్తులపై చర్చ జరిగిందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి నిర్మల్ కుమార్ తెలిపారు. ఎన్?డీఏతో పొత్తుకు అవకాశమే లేదన్న ఆయన సిద్ధాంతాల పరంగా బీజేపీ తమకు శత్రువని పేర్కొన్నారు. ఎన్నికల్లో పొత్తు పెట్టుకొని పోటీ చేస్తే విజయావకాశాలు మెరుగ్గా ఉంటాయని జిల్లా కార్యాదర్శులు, టీవీకే ప్రధాన కార్యదర్శికి తెలియజేసినట్లు తెలిసింది. ప్రజల సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకు ఈ ప్రచారం జరుగుతోందని పేర్కొంటూ, పార్టీ సభ్యులు అధికారిక ప్రకటనలనే నమ్మాలని కోరారు.

### 'తమిళనాడు ప్రజల సమస్యలపై దృష్టి'

అటు టీవీకేతో పొత్తు గురించి తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు నైనార్ నాగేంద్రన్?ను ప్రశ్నించగా, ఆయన సూటిగా సమాధానం ఇవ్వలేదు. మీరు కూటమి గురించి ఆలోచిస్తున్నారని, తను మాత్రం తమిళనాడు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపైనే దృష్టి ఉందని చెప్పారు. ముఖ్యంగా చట్టవ్యవస్థ వైఫల్యం, మహిళల భద్రతపై ఆందోళన చెందుతున్నాని అన్నారు.
టీవీకే స్థాపన సమయంలో విజయ్ తమ ప్రధాన రాజకీయ ప్రత్యర్థి డీఎంకే అని, సిద్ధాంతపరమైన ప్రత్యర్థి బీజేపీ అని స్పష్టం చేశారు. అయితే ఎన్?డీఏ కూటమిలో చేరేందుకు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మధ్యవర్తిత్వం చేసినట్లు వచ్చిన వార్తలు వచ్చాయి. దీంతో టీవీకే--ఎన్?డీఏ కూటమి అవకాశంపై చర్చలు మళ్లీ తెరపైకి వచ్చాయి. టీవీకేను ఎన్?డీఏలో చేర్చేందుకు కేంద్ర హోంమంత్రి అమిత్? షా కూడా ఆసక్తి చూపుతున్నారని ప్రచారం జరిగింది. ఈ క్రమంలో పార్టీ క్లారిటీ ఇవ్వడంతో పొత్తుపై స్పష్టత వచ్చింది.



### అభ్యర్థుల ఎంపికపై కసరత్తు

ఇక ఎన్నికల్లో పోటీ చేసేందుకు టీవీకే ఇప్పటికే అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను ప్రారంభించింది. పార్టీకి వచ్చిన దరఖాస్తుల్లో నుంచి సుమారు 60 మందిని విజయ్ ఇంటర్వ్యూ చేసి కొన్ని నియోజకవర్గాలకు అభ్యర్థులుగా ఎంపిక చేసినట్లు సమాచారం. అయితే కూటమి ఏర్పడితే ఆ సీట్లలో కొన్ని మిత్రపక్షాలకు ఇవ్వాల్సి వస్తుందా అనే అంశంపై కూడా జిల్లా నాయకుల అభిప్రాయాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. మరోవైపు అన్నాడీఎంకే నేతృత్వంలోని ఎన్?డీఏ సీట్ల కేటాయింపుపై చర్చలను ఇంకా ప్రారంభించ లేదు. ఇక అధికార డీఎంకే నేతృత్వంలోని కూటమిలో భాగమైన 21 పార్టీలతో సీట్ల కేటాయింపులపై చర్చలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే పొత్తులో భాగంగా మిత్రపక్షం కాంగ్రెస్?కు డీఎంకే 28 సీట్లు కేటాయించింది

### ఎన్నికల తేదీల కోసం ఎదురుచూపులు

కాగా, తమిళనాడు అసెంబ్లీ గడువు మే 10న ముగియనుంది. త్వరలోనే ఎన్నికల తేదీలను ప్రకటించే అవకాశం ఉంది. ఈ ఎన్నికల్లో అధికార డీఎంకే- కాంగ్రెస్ కలిసి పోటీ చేయనున్నా యి. బీజేపీ-అన్నాడీఎంకే కలిసి పోటీ చేస్తున్నాయి. నటుడు విజయ్ కూడా బరిలోకి దిగడంతో తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో త్రిముఖ పోరు నెలకొంది. ఎన్నికల నేపథ్యంలో ఇప్పటికే రాష్ట్ర రాజకీయ పార్టీలతో ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ కీలక సమావేశం నిర్వహించారు. ఎన్నికల తేదీల నిర్ణయంలో పండుగల తేదీలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని రాజకీయ పార్టీలు కోరాయి. దీనిని పరిశీలిస్తామని సీఈసీ హామీ ఇచ్చారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే 133 స్థానాల్లో గెలుపొందింది. కాంగ్రెస్ 18 సీట్లు, పీఎంకే 5 సీట్లు, వీసీకే 4, ఇతరులు 8 స్థానాల్లో గెలుచుకున్నాయి. డీఎంకే నేతృత్వంలోని కూటమి మొత్తం 159 సీట్లు సాధించింది. ఎన్?డీఏ 75 సీట్లు గెలుచుకుంది, అందులో అన్నాడీఎంకే 66 స్థానాల్లో విజయం సాధించింది.

## కాంగ్రెస్ విదేశీ శక్తుల కీలుబొమ్మ



సిల్చార్ (అస్సాం): ప్రపంచ వ్యాప్తంగా యుద్ధ మేఘాలు కమ్ముకున్న ప్రస్తుత తరుణంలో, దేశ ప్రజల్లో అనవసర భయాందోళనలు సృష్టిస్తూ, కాంగ్రెస్ పార్టీ దేశ ప్రయోజనాలను పణంగా పెడుతోందని ప్రధాని నరేంద్ర మోదీ మండిపడ్డారు. అస్సాంలోని సిల్చార్ వేదికగా శనివారం జరిగిన బహిరంగ సభలో పాల్గొన్న ఆయన, కాంగ్రెస్ పార్టీ వైఖరిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. భారతదేశం సాధిస్తున్న వేగవంతమైన వృద్ధిని జీర్ణించుకోలేకపోతున్న కొన్ని అంతర్జాతీయ శక్తుల చేతుల్లో కాంగ్రెస్ పార్టీ ఒక కీలుబొమ్మగా మారుతోందని ప్రధాని ఆరోపించారు. 'ప్రస్తుతం ప్రపంచమంతటా యుద్ధ వాతావరణం నెలకొంది. ఇటువంటి క్లిష్ట సమయంలో దేశ ప్రజలపై ఆ ప్రభావం పడకుండా తమ ప్రభుత్వం శక్తివంచన లేకుండా కృషి చేస్తోంది. అయితే బాధ్యతాయుతమైన రాజకీయ పక్షంగా వ్యవహరించాల్సిన కాంగ్రెస్.. దేశంలో అలజడి సృష్టించేందుకు ప్రయత్నిస్తోంది. దేశం ఇబ్బందుల్లో చిక్కుకోవాలని, తద్వారా మోదీని నిందించవచ్చని వారు ఆశిస్తున్నారు' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ప్రధాని మోదీ శనివారం ఈశాన్య రాష్ట్రాల కనెక్టివిటీని మెరుగుపరిచే పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. సుమారు రూ. 22,860 కోట్ల భారీ వ్యయంతో నిర్మించనున్న 'షిల్లాంగ్-సిల్చార్ కారిడార్'కు భూమిపూజ చేశారు. 166 కిలోమీటర్ల మేర సాగే ఈ గ్రీన్ ఫీల్డ్ ఫోర్-లేన్ హై స్పీడ్ కారిడార్ పూర్తయితే, గౌహతి నుంచి సిల్చార్ మధ్య ప్రయాణ సమయం ప్రస్తుతం ఉన్న 8.5 గంటల నుండి కేవలం 5 గంటలకు తగ్గుతుంది. ఇదేవిధంగా ప్రధాని మోదీ సిల్చార్‌లోని చీఎ-306 పై నిర్మించే ఎలివేటెడ్ కారిడార్‌కు భూమిపూజ చేశారు.అలాగే కరీంగంజ్ జిల్లాలోని పత్తర్‌కండి వద్ద కొత్త వ్యవసాయ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అస్సాంలో వ్యవసాయ విద్య, పరిశోధనలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ కళాశాలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రధాని పేర్కొన్నారు. దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతుంటే, విపక్షాలు కేవలం విమర్శలకే పరిమితమవుతున్నాయని ప్రధిన మోదీ అన్నారు.

## లూజ్‌గా పెట్రోల్ అమ్మొద్దు

ఇరాన్ యుద్ధం నేపథ్యంలో ముందు జాగ్రత్తగా పెట్రోల్, డీజిల్‌ను సీసాలు, డబ్బాలు వంటి విడి పాత్రలలో నిల్వ చేసుకోవడంపై కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ ఓ ప్రకటన జారీ చేసింది. అదే సమయంలో, దేశవ్యాప్తంగా అన్ని పెట్రోల్ బంకుల్లో ఇంధన నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ఇటీవల తమిళనాడులోని ఒక రిటైల్ అవుట్‌లెట్‌లో వినియోగదారుడికి లూజ్ కంటైనర్‌లో పెట్రోల్ పోసిన విషయం తమ దృష్టికి వచ్చిందని మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇది భద్రతా నిబంధనలకు పూర్తిగా విరుద్ధమని, అందుకే ఆ పెట్రోల్ బంక్ లైసెన్సును తక్షణమే సస్పెండ్ చేసి, సంబంధిత యాజమాన్యంపై చర్యలు తీసుకున్నామని వెల్లడించింది. ఇలాంటి చర్యలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా చూడాలని పేర్కొంది. ఈ నేపథ్యంలో, దేశంలోని అన్ని రిటైల్ అవుట్‌లెట్లు, డీలర్లకు కఠిన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపింది. ఇంధనాన్ని సరఫరా చేసేటప్పుడు భద్రతా మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని, నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. పెట్రోల్ వంటి మండే స్వభావం ఉన్న ఇంధనాన్ని అసురక్షిత పద్ధతుల్లో నిల్వ చేయడం వల్ల తీవ్రమైన అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని, ప్రజలు ఈ విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కేంద్రం సూచించింది.

## 'భారత నౌకలకు హోర్ముజ్ జలసంధి మీదుగా వెళ్లేందుకు అనుమతి'



పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతోన్న వేళ హోర్ముజ్ జలసంధి ద్వారా భారత్‌కు వెళ్లే నౌకలకు సురక్షిత మార్గం కల్పించనున్నట్లు భారత్‌లోని ఇరాన్ రాయబారి మహమ్మద్ ఫతాలి స్పష్టం చేశారు. రెండు దేశాల మధ్య ఉన్న దీర్ఘకాలిక స్నేహం, ఉమ్మడి ప్రయోజనాల ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. హోర్ముజ్‌లో భారత్ నౌకలకు సురక్షిత ట్రాన్సిట్ అనుమతిస్తారా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చిన ఫతాలి భారత్ తమకు మంచి స్నేహితుడిని వారికి సురక్షిత మార్గం కల్పిస్తామని ధ్రువీకరించారు.

### 'భారత్-ఇరాన్ మధ్య స్నేహం ప్రత్యేకం'

భారత్, ఇరాన్ మంచి స్నేహబంధం ఉందని, రెండు దేశాలకు పరస్పర ప్రయోజనాలు ఉన్నాయని ఫతాలి తెలిపారు. భారత్ ప్రజల బాధ తమ బాధగా భావిస్తామని, అదే విధంగా ఇరానీయుల పరిస్థితిని భారత్ కూడా అర్థం చేసుకుంటుందని పేర్కొన్నారు. రెండు దేశాలకు సాధారణ ప్రయోజనాలు, ఒకే విధమైన భవిష్యత్తు ఉందని ఆయన అన్నారు. భవిష్యత్తులో కూడా ఇది కొనసాగుతుందన్నారు. ఈ కారణంగానే భారత్ తమకు సాయం చేస్తుందన్నారు

### 'భారత ప్రభుత్వానికి సహకారం అందిస్తాం'

ప్రాంతీయ ఉద్రిక్తతల నేపథ్యంలో భారత ప్రభుత్వానికి సహకరించాలని ఇరాన్ ఉన్నతాధికారులు తమ రాయబార కార్యాలయానికి సూచించినట్లు ఫతాలి తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో భారత ప్రభుత్వానికి అవసరమైన సహకారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. కాగా, తాజాగా భారత జెండాలున్న రెండు ఎల్?పీజీ (ఌా+) రవాణా నౌకలను 'స్ట్రెయిట్ ఆఫ్ హర్మూజ్' గుండా ప్రయాణించడానికి ఇరాన్ తాజాగా అనుమతించింది.

### హర్మూజ్ జలసంధి మూసివేయలేదన్న ఇరాన్ ప్రతినిధి

పశ్చిమ ఆసియాలో పెరుగుతున్న భద్రతా పరిస్థితుల నేపథ్యంలో భారత్, ఇరాన్ నాయకత్వం మధ్య జరిగిన సంభాషణ విజయవంతమైందని ఇరాన్ సుప్రీం లీడర్ ప్రతినిధి అబ్దుల్ మజీద్ హకీం ఇలాహీ తెలిపారు. రెండు దేశాల మధ్య జరిగిన చర్చలు చాలా సానుకూలంగా సాగాయని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, హర్మూజ్ జలసంధిని మూసివేయలేదని స్పష్టం చేశారు. అయితే ప్రస్తుత పరిస్థితుల కారణంగా కొన్ని నౌకలు ప్రయాణించలేకపోతున్నాయని తెలిపారు. సాధారణంగా అయితే ఇరాన్ ఎప్పుడూ ఈ జలసంధిని మూసివేయాలని కోరుకోలేదని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు పెరగడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఇలాహీ అన్నారు.

### 'యుద్ధాన్ని ప్రారంభించిన వారే ఆపేయాలి'

ఇరాన్ ఈ యుద్ధాన్ని ప్రారంభించలేదని ఇలాహీ స్పష్టం చేశారు. అమెరికాతో చర్చలు కొనసాగుతుండగా, దౌత్యపరమైన ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయని ఆయన తెలిపారు. అయితే అకస్మాత్తుగా అమెరికా- ఇజ్రాయెల్ కలిసి ఇరాన్‌పై దాడి చేశాయని ఆరోపించారు. ఈ దాడుల్లో ఇరాన్‌లో పలు పౌరులు కూడా ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. దేశ గౌరవం, భూభాగాన్ని రక్షించేందుకు అవసరమైతే ఏ త్యాగానికైనా సిద్ధమని పేర్కొన్నారు. ఈ యుద్ధాన్ని ప్రారంభించినవారే దాన్ని ఆపాలని, అంతర్జాతీయ నాయకులు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్?పై ఒత్తిడి తీసుకురావాలని ఆయన సూచించారు.

### 'భారత్ ప్రజలు ఇరాన్‌కు మద్దతు ఇస్తారు'

భారత్ ప్రజలు మతభేదాలు లేకుండా న్యాయం కోసం నిలుస్తారని, ఇరాన్‌కు మద్దతు ఇస్తున్నారని ఇలాహీ అన్నారు. భారత్ సంస్కృతి, జ్ఞానం, నాగరికతకు ప్రతీక అని ఆయన పేర్కొన్నారు. మహాత్మా గాంధీ ఆలోచనలను అనుసరించే దేశంగా భారత్ న్యాయాన్ని సమర్థిస్తుందని చెప్పారు.

### ఇరాన్ విదేశాంగ మంత్రితో జైశంకర్ ఫోన్ సంభాషణ

మరోవైపు ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాగ్చీతో మరోసారి ఫోన్‌లో మాట్లాడినట్లు విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ తెలిపారు. ఈ సంభాషణలో ద్వైపాక్షిక అంశాలు, బ్రిక్స్‌కు సంబంధించిన విషయాలు చర్చించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుత ఉద్రిక్తతల తర్వాత ఈ ఇద్దరు నేతల మధ్య ఇది నాలుగోసారి సంభాషణ కావడం గమనార్హం. ఈ చర్చల్లో సముద్ర మార్గాల భద్రత, ఇంధన సరఫరా స్థిరత్వం వంటి అంశాలు ప్రధానంగా చర్చించినట్లు విదేశాంగ మంత్రిత్వశాఖ తెలిపింది.

# మూసీలో మంచినీరు పారేలా చేస్తామంటే విపక్షాలు అడ్డుకోవడమేంటి

-మొదటిపేజీ తరువాయి

సోమవారం నుంచి పనులు మొదలు అవుతాయన్నారు.

డబుల్ డెక్కర్ నిర్మాణం రాబోతుంది

అనంతరం మీడియాతో మాట్లాడారు. తాను ప్రతి రోజు హైదరాబాద్ – విజయవాడ 10లేన్ల జాతీయ రహదారి విస్తరణపై సంప్రదింపులు జరపడంతో పాటు, సమీక్షలు జరుపుతున్నామని కేంద్రం నుంచి అన్ని రకాల అనుమతులు రావడం కోసం కాస్త ఆలస్యం అయిందని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ఈ ప్రాంతంలో విద్యా, ఇతర పనుల నిమిత్తం ఎక్కువ గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చి స్థిరపడ్డ వారు ఎక్కువ ఉంటారన్నారు. గతంలో హైదరాబాద్ ఎల్బీనగర్ నుంచి మల్కాపూర్ రోడ్డు కోసం కృషి చేశానన్నారు. ఎల్బీనగర్ నుంచి హయత్ నగర్ రేడియో స్టేషన్ వరకు డబుల్ డెక్కర్ నిర్మాణం రాబోతుందని మంత్రి తెలిపారు.

నాగపూర్‌లో 8 కిలోమీటర్ల తర్వాత అతిపెద్ద డబుల్ డెక్కర్ నిర్మాణం మన ప్రాంతంలో 6 కిలోమీటర్ల వరకు నిర్మిస్తున్నాం అన్నారు. సుమారు రూ.940 కోట్లతో నిర్మిస్తున్న ఈ డబుల్ డెక్కర్ కారిడార్?లో రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.200 కోట్లు చెల్లించేందుకు ఇప్పటికే ఆదేశాలు జారీ అయ్యాయన్నారు. త్వరలో దీనికి సంబంధించిన సమావేశాలు ఉంటాయన్నారు. ఈ డబుల్ డెక్కర్ కారిడార్?లో పైన మెట్రో రైలు, నేషనల్ హైవే, కింద స్థానికులు వాహనాలు క్రాస్ చేసేందుకు యాక్సిడెంట్స్?కు ఆస్కారం లేకుండా వెహికిల్ అండర్ పాస్?లు ఏర్పాటు చేస్తున్నామని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. వచ్చే నెలలో టెండర్లు పూర్తి చేసి రహదారి విస్తరణ పనులు చేపట్టేలా ప్రణాళిక రూపొందించామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుమతి తీసుకొని రైల్వే స్టేషన్ కలుపుతూ వేసే మరో రోడ్డు రూ.8 కోట్ల పనులకు త్వరలో శంకుస్థాపన చేస్తామన్నారు.

**మూసి పునరుజ్జీవనం చేయాలి**

మూసీ విషజలాలతో బాధపడుతున్న 40 లక్షల మంది బాధితుల గోస చూడండని, తమ నల్లగొండ ప్రజల ఆరోగ్యం



గురించి మానవత్వంతో ఆలోచించండని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మూసీ విష జలాలతో 30 ఏళ్లకే 60 ఏళ్ల మనుషుల లాగా మారిపోతున్నారని, ప్రజలు కిడ్నీ, క్యాన్సర్ లాంటి భయంకర వ్యాధులతో సతమతం అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నల్లగొండ అంటేనే ఫ్లోరైడ్ జిల్లా విషపు జలాల జిల్లా అని పేరుందన్నారు. ఇక్కడి ప్రజల గోసను మానవత్వంతో అర్థం చేసుకోవాలని కోరారు. మూసి పునరుజ్జీవనం చేయాలని ఆలోచించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం భవిష్యత్ తరాలకు మేలు చేస్తుందన్నారు. దాదాపు మూడు గంటల ప్రజెంటేషన్ చూసామని, తమ నల్లగొండ ప్రజల కష్టాలు ఎలా తొలగుతాయి అనేది కళ్లకు కట్టినట్లు చూసామన్నారు.

**ఎవరెన్ని రాజకీయ విమర్శలు చేసినా**

గంగా నదిని, యమునా నదిని శుభ్రం చేస్తున్నారని, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నాయకులు ఇది గమనించాలని విజ్ఞప్తి చేశారు. మురికి కూపంలా ఉన్న మూసిలో మంచి నీటిని పారేలా చేస్తామంటే అడ్డు కోవడం దేనికి అని ఆయన ప్రశ్నించారు. 10 వేల మంది ఇళ్లు కోల్పోతున్నారని, వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు తప్పకుండా చూస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ప్రజల ఆరోగ్యం కోసం చేస్తున్న మంచి పనిని ప్రతిపక్షాలు రాజకీయం చేయొద్దని విజ్ఞప్తి చేశారు. అభివృద్ధి, ప్రజా సంక్షేమమే తమ ప్రధాన ఎజెండా అని, మళ్లీ వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని స్పష్టం చేశారు. ఎవరెన్ని రాజకీయ విమర్శలు చేసినా ప్రజల ఆరోగ్యం కోసం ఆలోచిస్తున్న ప్రభుత్వమే కావాలని కోరుకుంటారన్నారు. ప్రజల ఆరోగ్యం మాకు ప్రధానం అని దానికి తాము కట్టుబడి ఉన్నామన్నారు.

# అడగడుగునా అడ్డంకులు... ముందుకు సాగేదెలా

-మొదటిపేజీ తరువాయి

ఇళ్ల కూల్చివేతలు, నిర్వాసితులకు పరిహారం వంటి అంశాలపై ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తున్నాయి. బాధితుల్లో ఉన్న భయాన్ని తొలగించేందుకు నేరుగా ముఖ్యమంత్రే హామీ ఇస్తున్నారు అనే నమ్మకాన్ని కలిగించడం దీని ప్రధాన ఉద్దేశం. మూసీని లండన్‌లోని థేమ్స్ నది తరహాలో మారుస్తామన్న తన విజన్‌ను ప్రజల్లోకి నేరుగా తీసుకెళ్లడం ద్వారా, అభివృద్ధి నిరోధకులు ఎవరో ప్రజలే తేల్చుకోవాలనే సంకేతాన్ని ఆయన ఇవ్వనున్నారు. ఆసియా అభివృద్ధి బ్యాంకు వంటి అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులను కూడా ఈ సమావేశానికి ఆహ్వానించారు. ప్రాజెక్టు పట్ల ప్రభుత్వానికి ఉన్న స్పష్టమైన రోడ్ మ్యాప్‌ను వారికి వివరించడం ద్వారా నిధుల సమీకరణను సులభతరం చేసుకోవడం మరో లక్ష్యంముఖ్యమంత్రి తన ప్రజెంటేషన్‌లో ఐదు దశల్లో జరగబోయే అభివృద్ధిని వివరించనున్నారు. మొదటి దశలో చేపట్టబోయే పనులు, అందుకు అవసరమైన భూసేకరణ, రక్షణ గోడల నిర్మాణం గురించి క్లారిటీ ఇవ్వనున్నారు. 50 మీటర్ల బఫర్ జోన్ పరిధిలో ఉన్న నిర్మాణాలకు చట్టబద్ధంగా విలువ లేకపోయినా, మానవీయ కోణంలో ఇందిరమ్మ ఇళ్లు, ప్రత్యామ్నాయ స్థలాలు, ఆర్థిక సహాయం అందిస్తామని సీఎం హామీ ఇవ్వనున్నారు. బాపూఘాట్ వద్ద రూ.400 కోట్లతో నిర్మించ తలపెట్టిన 'గాంధీ సరోవర్', నది ఇరువైపులా నిర్మించబోయే ఎకనామిక్ జోన్ల గురించి విడమర్చి చెప్పనున్నారు.ప్రాజెక్టుకు మోక్షం కలగడం అనేది ప్రధానంగా మూడు అంశాలపై ఆధారపడి ఉంటుంది. మేధా పాట్కర్ వంటి సామాజిక కార్యకర్తలు ఇప్పటికే ఈ కార్యక్రమాన్ని వాయిదా వేయాలని కోరుతు న్నారు. ప్రజెంటేషన్ తర్వాత నిర్వాసితుల అనుమానాలు పటాపంచలైతేనే క్షేత్రస్థాయిలో పనులు వేగవంతం అవుతాయి. ఈ సమావేశానికి అన్ని రాజకీయ పార్టీల నేతలను ఆహ్వానించారు. ఒకవేళ ప్రతిపక్షాలు సానుకూలంగా స్పందిస్తే ప్రాజెక్టుకు రాజకీయ అడ్డంకులు తొలగుతాయి. లేనిపక్షంలో ఇది కేవలం అధికార పక్ష 'షో'గా మిగిలిపోయే ప్రమాదం ఉంది. కేవలం డిజైన్లు చూపడం కాకుండా, క్షేత్రస్థాయిలో పునరావాస పనులు ఏ మేరకు పకడ్బందీగా జరుగుతాయన్న దానిపైనే ప్రాజెక్టు విజయం ఆధారపడి ఉంటుంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ప్రజెంటేషన్ ద్వారా మూసీ ప్రాజెక్టును రాజకీయ వివాదం నుంచి అభివృద్ధి అజెండాగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇది కేవలం ఒక ప్రసంగం కాదు, హైదరాబాద్ భవిష్యత్తుపై ఆయన ఇస్తున్న భరోసా. ఈ వివరణ ప్రజల్లోకి బలంగా వెళ్తే, దశాబ్దాల కాలంగా మురుగు కూపంగా మారిన మూసీకి నిజంగానే పునరుజ్జీవం లభించే అవకాశం ఉంది. ఈ ప్రెజెంటేషన్ ఒక రకంగా మూసీ ప్రాజెక్టుకు అగ్నిపరీక్ష వంటిదని చెప్పవచ్చు.

# చివరి దశకు మావోయిస్టుల పోరాటం

**వరంగల్ :** తెలంగాణ రాష్ట్ర చరిత్రలో ఒక కీలకమైన అధ్యాయం అవిష్కృతంకానుంది. దశాబ్దాల కాలంగా సాయుధ పోరాట బాటలో సాగిన మావోయిస్టులు భారీ సంఖ్యలో జనజీవన స్రవంతిలో కలిసేందుకు సిద్ధమయ్యారు. . దశాబ్దాల కాలంపాటు అజ్ఞాతంలో ఉండి, సాయుధ పోరాటమే మార్గమని నమ్మిన మావోయిస్టు అగ్రనేతలు రాజకీయ పార్టీ ఏర్పాటు దిశగా ఆలోచన చేస్తున్నారు. జనజీవన స్రవంతిలో కలిసిన తర్వాత సీనియర్ నాయకులంతా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమయ్యారు. దాదాపు గంటసేపు సాగిన సమావేశంలో మావోయిస్టు నేతలు తమ అంతరంగాన్ని ఆవిష్కరించారు. వారి సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ క్రమంలోనే రాజకీయ పార్టీ విషయం కూడా చర్చకు వచ్చింది. నాలుగున్నర దశాబ్దాల పాటు అడవిని నమ్ముకొని పోరాటం చేసిన కీలక నేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఇటీవలే డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో లొంగిపోయిన మావోయిస్టు పొలిట్ బ్యూరో సభ్యుడు, సెంట్రల్ మిలటరీ కమిషన్ ఇన్‌ఛార్జ్ తిప్పిరి తిరుపతి(దేవ్‌జి), కేంద్ర కమిటీ సభ్యులు మల్లా రాజిరెడ్డి(సంగ్రామ్), రాష్ట్ర కమిటీ కార్యదర్శి బడే చొక్కారావు (జగన్), రాష్ట్ర కమిటీ సభ్యుడు నూనె నర్సింహారెడ్డి (గంగన్న) ముఖ్యమంత్రిని కలిశారు. వీరితోపాటు గతంలోనే లొంగిపోయిన కేంద్ర కమిటీ సభ్యులు పుల్లూరి ప్రసాద్, పోతుల పద్మావతి కూడా ఉన్నారు. ఈ భేటీలో మావోయిస్టు నేతలు ఒక సంచలన ప్రతిపాదన చేశారు. కేంద్ర ప్రభుత్వం అంగీకరిస్తే సాయుధ పోరాటాన్ని ప్రజాస్వామ్య పద్ధతిలో కొనసాగిస్తామని పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీని రద్దు చేస్తామని దేవ్‌జి, రాజిరెడ్డి స్పష్టం చేశారు. ఇప్పటి వరకు అనుసరించిన పోరాట పంథాను వదిలి, చట్టపరంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాన్ని కొనసాగించాలని భావిస్తున్నట్టు వెల్లడించారు. అంతేకాకుండా, ప్రభుత్వాలు సహరిస్తే రాజకీయ పార్టీగా మార్చేందుకు కూడా సిద్ధమని వారు తెలిపారు. ఈ ప్రతిపాదనపై స్పందించిన రేవంత్ రెడ్డి, ఈ అంశం తన పరిధిలో లేదని త్వరలోనే కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కలిసినప్పుడు ఈ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్తాను అని హామీ ఇచ్చారు. కేంద్రం ఓకే అంటే కేంద్ర హోంమంత్రిని ఇక్కడికి పిలిపించి, ఒక భారీ సభ ఏర్పాటు చేసి ఈ విషయాన్ని ప్రకటిస్తామని సీఎం చెప్పారు.



మావోయిస్టు నేతలు తమ పునరావాసం, ఇతర మౌలిక వసతుల గురించి ముఖ్యమంత్రి కీలక అభ్యర్థనలు చేశారు. లొంగిపోయిన మావోయిస్టులకు తక్షణమే ఆరోగ్య శ్రీ సదుపాయం కల్పించాలని సీఎం ఆదేశించారు. ప్రస్తుతం లొంగిపోయిన వారికి 30 ఏళ్ల క్రితం నాటి రివార్డు సొమ్మునే ఇస్తున్నారని, ఇతర రాష్ట్రాల్లో ఇది ఎక్కువగా ఉందని తెలిపారు. దీనిపై అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని డీజీపీని ఆదేశించారు. ఇళ్ల స్థలాలు ఇవ్వడంపై క్యాబినెట్‌లో చర్చిస్తామని, అయితే వ్యవసాయ భూమి ఇవ్వడం సాధ్యం కాదని సీఎం స్పష్టం చేశారు. ఏవైనా రాజకీయ అంశాలు ఉంటే ప్రభుత్వ సలహాదారు కేశవరావును, ఆర్థికపరమైన అంశాల కోసం వేం నరేందర్‌రెడ్డిని కలవాలని సీఎం సూచించారు. జన జీవన స్రవంతిలో కలిసిన నేతలకు ఎలాంటి భద్రతా పరమైన ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను సీఎం ఆదేశించారు. హింస దేనికీ పరిష్కారం కాదని, ప్రజాస్వామ్య పద్ధతిలోనే ప్రజల ఆకాంక్షలు నెరవేరుతాయని ఆయన హితవు పలికారు. సమావేశం అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మహబూబ్‌నగర్ జిల్లా గద్వాల్‌కు చెందిన సుజాతక్కతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఎన్‌కౌంటర్‌లో మరణించిన మల్లోజుల కోటేశ్వరరావు భార్య అయిన ఆమె యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. లొంగిపోయిన మావోయిస్టుల వివరాలు, వారికి ప్రభుత్వం తరఫున అందే పునరావాస ప్యాకేజీలు, ఈ పరిణామం వెనుక ఉన్న కీలక అంశాలను సీఎం వివరించే అవకాశం ఉంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం, లొంగిపోయే మావోయిస్టులకు ప్రభుత్వం తక్షణ సహాయంతో పాటు, వారు సమాజంలో గౌరవప్రదంగా బతకడానికి అవసరమయ్యే ఉపాధి, ఇతర వసతులను కల్పిస్తుంది. ముఖ్యమంత్రి స్వయంగా ఈ కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా, హింసను వీడి వచ్చే వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని బలమైన సందేశాన్ని పంపాలని భావిస్తున్నారు.

## మే 11 నుంచి తొలిదశ జనాభా లెక్కలు

-మొదటిపేజీ తరువాయి

సింక్రోనస్ సెన్సెస్ (సమకాలిక జనాభా లెక్కలు) జరిగాయని చెప్పారు. 1951లో తొలిసారి స్వాతంత్ర్య భారత్‌లో జనగణన జరిగిందని తెలిపారు. 2027లో జరగనున్న ఈ జనగణన స్వాతంత్ర్య భారత్‌లో ఎనిమిదోసారి, మొత్తంగా 16వదని గుర్తు చేశారు.

డిజిటల్ మోడ్‌లో జనగణన

కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రాల సహకారంతో ఫెడరల్ స్ఫూర్తితో జనగణన జరుగుతోందని వివరించారు. రాష్ట్రంలో సీఎస్, నోడల్ ఆఫీసర్, ప్రిన్సిపల్ సెన్సెస్ ఆఫీసర్, ఛార్జ్ ఆఫీసర్‌తో పాటు ఎన్యుమరేటర్స్, సూపర్వైజర్లు దీనిలో పాల్గొంటారని తెలిపారు. ఇందులో సేకరించిన సమాచారాన్ని పూర్తిగా భద్రంగా ఉంటుందని, దుర్వినియోగం చేసే అవకాశం ఉండదని హామీ ఇచ్చారు. ఎన్యూమరేటర్లు ఎవరైనా అతిగా ప్రవర్తిస్తే మూడు నెలల వరకు జైలుశిక్షతో పాటు జరిమానా ఉంటుందని హెచ్చరించారు. ఈసారి పూర్తిగా డిజిటల్ మోడ్‌లో జనగణన చేపట్టేందుకు ఆఫ్‌లైన్ మోడ్‌లో పని చేసే యాప్‌ను ఉపయోగిస్తున్నట్లు వెల్లడించారు.

"తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో జరగనున్న తొలి జనగణన జరగనున్న నేపథ్యంలో అందరూ సహకరించాలి. రాష్ట్రంలో 11 మే నుంచి జూన్ 09 వరకు తొలిదశ లెక్కింపు జరుగుతుంది. హౌస్ హోల్డింగ్ లెక్కింపులో ప్రతి బిల్డింగ్ సహా పూరి గుడిసెలకు నెంబర్ ఇస్తాం. ఇందులో సెల్ఫ్ ఎన్యుమరేషన్‌కు 2026 ఏప్రిల్ 26 నుంచి మే 10 వరకు అవకాశం కల్పిస్తున్నాం. 2వ దశలో జనాభా లెక్కింపు 2027 ఫిబ్రవరి 9 నుంచి 28 వరకు జరుగుతుంది. 2027 ఫిబ్రవరి 28 రాత్రి నిరాశ్రయుల లెక్కింపు ఉంటుంది" – భారతి హోళికేరి, జనగణన డైరెక్టర్

రివిజన్ రౌండ్‌లో 33 ప్రశ్నలు : 2027 మార్చ్ 01 నుంచి 05 వరకు రివిజన్ రౌండ్ ఉంటుందని భారతి పేర్కొన్నారు. మొదటి దశలో 33 ప్రశ్నలు ఉంటాయని తెలిపారు. వాటిలో 1-14 వరకు ఆ బిల్డింగ్ స్థితిగతులు, 15-24 నుంచి మౌలిక వసతులు, 25-31 వరకు ఇంట్లో ఉండే చిన్న చిన్న ఆస్తులకు సంబంధించిన ప్రశ్నలు ఉంటాయని పేర్కొన్నారు. 32లో ఆహార అలవాట్లు, 33లో మొబైల్ నెంబర్ ఉంటాయన్నారు. సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసిన తర్వాత ఎడిట్ ఆప్షన్ కూడా ఉంటుందని పేర్కొన్నారు.

ప్రీటెస్ట్ విజయవంతం

సన్నద్ధతలో భాగంగా హౌస్‌లిస్టింగ్ అండ్ హౌస్ సెన్సెస్ ఆపరేషన్‌లో భాగంగా 2025 నవంబర్ 10 నుంచి 30 వరకు ప్రీటెస్ట్ నిర్వహించినట్లు భారతి తెలిపారు. దీనికోసం జీహెచ్ఎంసీ పరిధిలో 22వ సర్కిల్ 112వ వార్డ్?లో, నల్గొండ జిల్లాలో తిప్పర్తి, ఏజెన్సీ ఏరియాలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పినపాకను ఎంచుకుని విజయవంతంగా పూర్తి చేసినట్లు వెల్లడించారు. 2027లో జరగనున్న జనగణన కోసం లెవల్ 1లో ఇద్దరు నేషనల్ ట్రైనర్స్ ఉంటారు. లెవల్ 2లో 66 మంది మాస్టర్ ట్రైనర్స్, లెవల్ 3లో 1220 మంది ఫీల్డ్ ట్రైనర్స్, ఛార్జ్ క్లర్క్ అండ్ టెక్నికల్ అసిస్టెంట్ ట్రైనింగ్ 3,728, ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు కలిసి 88,470 మంది ఉన్నారని తెలిపారు. ప్రిన్సిపల్ సెన్సెస్ అధికారిగా ఉండే వ్యక్తి ఆ జిల్లాలో జరిగే లెక్కింపుపై పూర్తి అధికారం కలిగి ఉంటారని చెప్పారు. ఎన్యూమరేటర్లు తప్పు సమాచారం సేకరించవద్దని, ఏదైనా తప్పు ఉంటే ఎడిట్ అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సరైన సమయంలో క్వాలిటీ డాటా ఇవ్వడమే ఎన్యుమరేటర్ల ప్రధాన కర్తవ్యమని తెలిపారు.

అవాస్తవాలను నమ్మొద్దు

దేశంలో అక్రమంగా ఉన్న రోహింగ్యాలు కూడా జనాభా లెక్కల్లో ఉంటారని విదేశాల్లో పని కోసం వెళ్లినవారు ఈ లెక్కల్లో ఉండరని తెలిపారు. ఇవి భారత పౌరసత్వాన్ని నిర్ణయించే లెక్కలు కావని కేవలం జనాభా ఎంత ఉందో తెలుసుకోవడానికి చేస్తున్నందున ప్రజలంతా అవాస్తవాలను నమ్మొద్దని కోరారు. సమాచారం గోప్యంగా ఉంటుందని హామీ ఇచ్చారు.

## డొమెస్టిక్ సిలిండర్ల కోసం ఆందోళన అవసరం లేదు

-మొదటిపేజీ తరువాయి

చేసినట్లు చెప్పారు. ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో శనివారం మంత్రి ఉత్తమ్ సమావేశమయ్యారు. తాజా పరిస్థితులపై అసోసియేషన్ ప్రతినిధులు మంత్రితో చర్చించారు. అనంతరం ఉత్తమ్ మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 810 మంది ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్లు, 1.3 కోట్ల మంది వినియోగదారులు ఉన్నారని చెప్పారు. "28 లక్షల మంది దీపం పథకం కింద ఎల్‌పీజీ వినియోగిస్తున్నారు. 7.5 లక్షల మంది కమర్షియల్ సిలిండర్లు వాడుతున్నారు. ప్రతినెలా డొమెస్టిక్ సిలిండర్లు 58 నుంచి 60 లక్షల సిలిండర్లు వాడుతున్నాం. కమర్షియల్ సిలిండర్ల పంపిణీ కొరత ఉంది. ఎల్‌పీజీ సిలిండర్లు గత కొద్ది రోజులుగా సాధారణం కంటే రెట్టింపు బుక్ అవుతున్నాయి. కమర్షియల్ సిలిండర్లు అవసరమైన సంఖ్యలో రోజుకు కేవలం 20శాతం మాత్రమే పంపిణీ చేయగలుగుతున్నాం. గృహ అవసరాలకు ఎవరూ ఇబ్బంది పడాల్సిన అవసరం లేదు. గతంలో రోజుకు 2.15 లక్షల డొమెస్టిక్ సిలిండర్లు పంపిణీ చేసేవాళ్లం. గత రెండు రోజులుగా 2.3 లక్షలు సప్లై చేస్తున్నాం. గతంలో కమర్షియల్ సిలిండర్లు రోజుకు 23వేలు డిస్ట్రిబ్యూట్ చేసేవాళ్లం, కానీ, ప్రస్తుతం రోజుకు 6 వేలు మాత్రమే సప్లై చేయగలుగుతున్నాం" అని ఉత్తమ్ వివరించారు.

## శక్తివంతంగా మారుతున్న తెలంగాణ జాగృతి

**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం ఒక అనూహ్య మార్పు కనిపిస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత బీఆర్ఎస్ పార్టీ ప్రధాన నేతలు ఇంకా ప్రతిపక్ష పాత్ర పోషించడంలో కొంత తడబడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. తాము ఇంకా సమర్థవంతమైన ప్రతిపక్షంగా మారలేకపోతున్నాం అని గతంలో మాజీ మంత్రి జగదీష్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఈ పరిస్థితికి అద్దం పడుతున్నాయి. అయితే, సరిగ్గా ఇక్కడే కల్వకుంట్ల కవిత తనదైన శైలిలో రాజకీయ దూకుడు పెంచారు.



బీఆర్ఎస్ పార్టీ కంటే వేగంగా ఆమె క్షేత్రస్థాయి సమస్యలపై స్పందిస్తూ, ప్రజల్లోకి దూసుకుపోతున్నారు. ముఖ్యంగా ఖమ్మం జిల్లాలోని వెలుగుమట్ల గ్రామంలో పేదల ఇళ్ల కూల్చివేతపై కవిత చేసిన పోరాటం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు కారణం ?వుతోంది. నిరాశ్రయులైన కుటుంబాల కోసం ఆమె ఏకంగా ఖమ్మం నడిబొడ్డున ఆమరణ నిరాహార దీక్షకు దిగడం, పోలీసుల నిర్బంధాన్ని సైతం లెక్కచేయకుండా పోరాడటం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. బీఆర్ఎస్ కేడర్ అంతా స్తబ్దుగా ఉన్న తరుణంలో, ఆమె నేరుగా గ్రౌండ్ లెవల్‌లోకి వెళ్లి బాధితులకు భరోసా ఇవ్వడం ద్వారా అటు పార్టీ శ్రేణుల్లో, ఇటు ప్రజల్లో ఆమెపై సానుభూతి , మద్దతు పెరుగడానికి కారణం అయింది.ఢిల్లీ లిక్కర్ కేసు నుండి విముక్తి పొందిన కవిత తెలంగాణ జాగృతి వేదికగా తన రాజకీయ పునరాగమనాన్ని అత్యంత శక్తివంతంగా చాటుకుంటున్నారు. తనను పార్టీ నుండి పంపేశారని చెబుతున్న ఆమె చేస్తున్న పోరాటాలు చూస్తుంటే.. బీఆర్ఎస్ చేయలేని పనిని ఆమె ఒంటిచేత్తో చేస్తున్నట్లు కనిపిస్తోంది. కేసీఆర్, కేటీఆర్ వంటి అగ్రనేతలు ఇంకా వ్యూహాల్లో నిమగ్నమై ఉండగా, కవిత మాత్రం నేరుగా యాక్షన్ లోకి దిగడం బీఆర్ఎస్‌కు షాక్ లాంటిదే. కవిత ఇప్పుడు తన 'తెలంగాణ ఉద్యమ కాలం' నాటి పంథాను మళ్లీ ఎంచుకున్నారు. అప్పట్లో జాగృతి ద్వారా ఎలాగైతే ప్రజలను సమీకరించారో, ఇప్పుడు కూడా అదే ఫార్ములాతో వెళ్తున్నారు. చట్టసభల్లో గొంతుక కంటే.. వీధుల్లో చేసే పోరాటమే బలంగా వినిపిస్తుంది అనే సిద్ధాంతాన్ని ఆమె పాటిస్తున్నారు. జగదీష్ రెడ్డి చెప్పినట్లుగా పార్టీ ఇంకా ప్రతిపక్ష పాత్రకు అలవాటు పడకపోవచ్చు కానీ, కవిత మాత్రం ఇప్పటికే ఆ పాత్రలో ఒదిగిపోయారు. ప్రజా సమస్యలపై ఆమె చూపిస్తున్న ఈ తెగువ, కాంగ్రెస్ ప్రభుత్వంపై చేస్తున్న విమర్శలు ఆమెకు ప్రజల మద్దతును మరింత పెంచుతున్నాయి. భవిష్యత్తులో బీఆర్ఎస్ కేడర్ కూడా ఆమె నాయకత్వం వైపు మొగ్గు చూపినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని చెబుతున్నారు. కేటీఆర్ కూడా వెంటనే.. ప్రెస్మీట్లు, సోషల్ మీడియా విమర్శలకే పరిమితం కాకుడా.. ప్రత్యక్షంగా రాజకీయ యుద్ధాలకు దిగాలన్న అభిప్రాయం బీఆర్ఎస్ క్యాడర్ లో వినిపిస్తోంది.

## సంపాదకీయం

# మధ్యప్రాచ్యంలో యుద్ధ మంటలు ఆరేదెపుడు!

మధ్య ప్రాచ్యంలో ఉద్రిక్తతల మంటలు పరాకాష్టకు చేరాయి. ఫిబ్రవరి 28, 2026 రోజు ఇరాన్ అత్యున్నత నాయకుడైన అయొతొల్లా అలీ ఖమేనీని హత్య చేసింది మొదలు గత 14 రోజులుగా కొనసాగుతున్న అమెరికా-ఇజ్రాయిల్-ఇరాన్ యుద్ధంలో అగ్రరాజ్యమే అధికంగా ఆస్తి, ప్రాణ నష్టాలను మూటకట్టుకుంటున్నది. నేడు ఇరాన్ యుద్ధ వ్యూహాల ముందు అమెరికా-ఇజ్రాయిల్ అత్యాధునిక ఆయుధాలు వెలవెలబోతున్నాయి. ఆయుధ సంపత్తి కన్న వ్యూహాలే విజయాన్ని తెస్తాయని నేడు ఇరాన్ రుజువు చేస్తున్నది. యుద్ధ తీవ్రత పెరిగిన కొద్ది ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలు బలహీనపడుతున్నాయి. వంట గ్యాస్ కొరతతో పర్యాటకం, సామాన్యుల వంటిళ్లు, హోటల్స్, పరిశ్రమలు, రవాణా వ్యవస్థలు కుదేలు అవుతున్నాయి. 'హోర్మోజ్ జలసంధి(స్ట్రైట్ ఆఫ్ హర్మోజ్)" గుండా చమురు-ఎల్పీజీ రవాణాను అడ్డుకొని ప్రపంచ దేశాలకు ఇంధన కొరత సృష్టించడం ద్వారా అమెరికాపై ఒత్తిడి పెంచడం, తక్కువ ఖర్చు కలిగిన డ్రోన్ బాంబులను ప్రయోగిస్తూ వాటిని అడ్డుకోవడానికి అమెరికా-ఇజ్రాయిల్ అధిక ఖర్చు కలిగిన క్షిపణులను వాడటానికి పురికొల్పడం లాంటి ఇరాన్ వ్యూహాలు నేడు అగ్రరాజ్యానికి చెమటలు పుట్టిస్తున్నాయి. యుద్ధంలో ఎవరు గెలిచినా, ఎవరు ఓడినా, ప్రపంచ దేశాల సామాన్య ప్రజలు భారీ మూల్యాన్ని చెల్లించాల్సి వస్తున్నది. చమురు, వంట గ్యాస్ సరఫరా ఆగిపోవడంతో నేడు ప్రపంచ దేశాల్లో వంటింటిలో మంటలు ఎగిసిపడుతున్నాయి. బ్యారెల్ చమురు ధర 59 డాలర్ల నుంచి నేడు యుద్ధం కారణంగా 120 డాలర్లకు చేరడం వల్ల చమురు, వంట గ్యాస్‌తో పాటు సరుకుల ధరలు ఆకాశానంటుతున్నాయి. రానున్న రోజుల్లో చమురు ధరలు 200 డాలర్లకు చేరి ప్రపంచ దేశాలు ద్రవ్యోల్బణ ఉచ్చులో చిక్కి గిలగిలా కొట్టుకోవడం తప్పనిసరి అని తోస్తున్నది. వెనెజ్వెలాలో 03 జనవరి 2026 రోజున 'నికోలస్ మదురో'ను నిర్బంధించిన అమెరికా అక్కడ తన కీలుబోమ్మకు పాలన పగ్గాలు కట్టబెట్టడం చూసాం. ఇరాన్ వద్ద ఉన్న 400 కేజీల శుద్ధి చేసిన యురేనియం నిల్వలను స్వాధీనం చేసుకునేందుకు అమెరికా-ఇజ్రాయిల్ దేశాలు ఈ యుద్ధాన్ని ప్రారంభించాయి. అణ్వాయుధాలను ఇజ్రాయిల్‌పై వాడవచ్చనే భావనతో ఇరాన్‌పై యుద్ధం ప్రకటించిన అమెరికా-ఇజ్రాయిల్ దేశాలు నేడు భారీ మూల్యాలను చెల్లిస్తున్నాయి. తమకు వ్యతిరేకంగా పాలన సాగిస్తున్న అలీ ఖమేనీని చంపి, అతని స్థానంలో తమకు నచ్చిన పాలకుడిని సుప్రీమ్ లీడర్‌గా నియమించాలని కలలు కన్న అమెరికా-ఇజ్రాయిల్ వ్యూహాలు బెడిసికొట్టినట్లు స్పష్టం అవుతోంది. యుద్ధం తొలి రోజు ఇరాన్ నిరంకుశ అగ్ర నాయకుడు అయతొల్లా అలీ ఖమేనీని బాంబులు వేసి మట్టుబెట్టి విజయం సాధించామని పలుకులు పలికిన అమెరికా-ఇజ్రాయిల్ నేడు ఆచితూచి యుద్ధాన్ని కొనసాగించాల్సి వస్తున్నది. గడిచిన 14 రోజుల్లో ఇరాన్‌కు చెందిన 1200 మంది మరణించగా, దాదాపు 5,000 వరకు గాయపడినట్లు వివరాలు తెలుపుతున్నాయి. అదే విధంగా 10 మందికి పైగా అమెరికా సైనికులు మరణించడం, 150 వరకు గాయపడడంతో పాటు ఇరుగుపొరుగు దేశాల్లో ఉన్న 22 అమెరికా సైనిక-విమానయాన స్థావరాలపై ఇరాన్ దాడులు చేయడంతో అమెరికాకు భారీ నష్టం వాటిల్లుతున్నది. 13 మార్చి రోజు తాజాగా పశ్చిమ ఇరాన్‌లో అమెరికన్ విమానం కూలిపోయిన ఘటనలో నలుగురు సిబ్బంది మరణించినట్లా నిర్ధారణ అయ్యింది. ఈ యుద్ధంలో ఇద్రాయిల్‌కు చెందిన కనీసం 15 మంది మరణించగా, 2,000 వరకు గాయపడినట్లు తెలుస్తున్నది. అమెరికా అత్యాధునిక గగనతల రక్షణ వ్యవస్థలను ఛేదించుకుంటూ ఇరాన్ డ్రోన్, క్షిపణి దాడులు భారీ నష్టాలను కలిగిస్తున్నాయి. కువైట్, ఖతార్, బెహ్రెయిన్, దుబాయ్ లాంటి గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలు, విమానాశ్రయాలు, రాయబార కార్యాలయాలు, చమురు శుద్ధి కేంద్రాలను కేంద్రంగా చేసుకొని ఇరాన్ విరుచుకుపడుతున్నది. అమెరికా-ఇజ్రాయిల్ చేస్తున్న తీవ్రమైన దాడుల్లో ఇరాన్‌లోని సైనిక, వైమానిక, నావికా, బ్యాంకులు, అతి ముఖ్యమైన కేంద్రాలు పూర్తిగా నేలమట్టం అవుతున్నాయి. ఈ యుద్ధంలో ప్రత్యర్థి దేశాల వనరుల విధ్వంసం, ఆర్థికంగా బలహీన పరచడం, తక్కువ ఖర్చుతో ఎక్కువ నష్టాన్ని కలిగించడం, సైనిక బలగాల ధైర్యాన్ని బలహీన పరచడం, సిబ్బందికి ప్రాణహాని తలపెట్టడం లాంటి లక్ష్యాలతో కూడిన వ్యూహాలను నేడు ఇరాన్ అమలు చేయడాన్ని "వార్ ఆఫ్ అట్రిషన్" అని పిలుస్తున్నాం. అలీ ఖమేనీ స్థానంలో సుప్రీమ్ లీడర్‌గా ఎంపికైన అతని కుమారుడిని కరుడుగట్టిన ఉగ్రనేత 'మొజ్తాతా ఖమేనీ' కూడా నిరంకుశ పాలకుడిగా తన సత్తాను చాటుతున్నారు. ఈ నూతన ?తను కూడా హత్య చేస్తామంటూ నెతన్యాహు బీజాలు పలుకుతున్నారు. యుద్ధ నీతి నియమాలకు విరుద్ధంగా పాఠశాలలు, ఆసుపత్రులు, పౌర ఆవాసాలను సహితం లక్ష్యంగా చేసుకొని అమెరికా-ఇజ్రాయిల్ దాడులు జరుగుతున్నాయి. అత్యంత ఖరీదైన అమెరికల్ ఎఫ్-15ఈ స్ట్రైక్ ఈగిల్ యుద్ధ విమానాలు, రూ: 250 కోట్ల విలువైన ఎంక్యూ-9 రీపర్ డ్రోన్లు, 22 వేల కోట్ల విలువైన థాడ్ రక్షణ వ్యవస్థల రాడార్ కేంద్రాలను ఇరాన్ డ్రోన్లు విధ్వంసం చేయడం జరుగుతున్నది. కొద్ది రోజుల్లో ముగుస్తుందనుకున్న ఈ యుద్ధం కొనసాగడంతో అమెరికా ఇప్పటికే రోజుకు సుమారు 2 బ్లియన్ డాలర్ల ఖర్చు చేస్తున్నది. కేవలం మొదటి వారంలోనే రూ 51 వేల కోట్ల ఖర్చు చేసింది. ఇరాన్ ప్రయోగిస్తున్న చవకైన షాహెడ్ డ్రోన్లను అడ్డుకోవడానికి లక్షల డాలర్ల విలువైన క్షిపణులను అమెరికా వాడాల్సి రావడంతో అగ్రరాజ్యం భారీ నష్టాలను మూటకట్టుకుంటున్నది. ఈ యుద్ధం వల్ల అభివృద్ధి చెందుతున్న భారత్‌తో పాటు ఆగ్నేయాసియా దేశాలు అధికంగా ప్రభావితం అవుతున్నాయి. ఇరాన్‌పై అమెరికా ప్రకటించిన "ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ"తో పాటు ఇజ్రాయిల్ చేపట్టిన "ఆపరేషన్ రోరింగ్ లయన్" వల్ల ఇరాన్ కొద్ది రోజుల్లో తమ దారికి వస్తుందని ఊగహించిన అమెరికా-ఇజ్రాయిల్ దేశాలకు ఈ యుద్ధ ముగింపు దగ్గర్లో కనిపించడంతో లేదు. ఇరాన్ చేస్తున్న ఈ యుద్ధంలో తమ ఐఆర్‌జీసీ సైనిక బలగాలు ముందుండి తీవ్రంగా ప్రతిఘటించడం, ఎదురు దాడులు చేయడం చూస్తున్నాం. నేడు ఇరాన్‌తో పాటు హెజ్బుల్లా వర్గాలను మట్టుబెట్టడానికి అమెరికా-ఇజ్రాయిల్ వ్యూహాలు పన్నుతున్నది. "గ్లోబల్ ఫైర్‌పవర్ సూచిక"లోఅమెర్కా ప్రథమ స్థానంలో ఉండగా ఇజ్రాయిల్ 15వ స్థానంలో, ఇరాన్ 16వ స్థానంలో ఉన్నాయి. ఈ సూచికలో భారత్ 4వ స్థానం ఉందని గమనించగలరు. హోర్మోజ్ జలసంధికి ఇరువైపులా ఉన్న భారత్‌కు చెందిన 28 వ్యాపార నౌకలను సురక్షితంగా రప్పించేందుకు భారత ప్రభుత్వం చర్యలు చేబడుతున్నది. డొనాల్డ్ ట్రంప్ పెట్టిన చిచ్చు ఇప్పట్లో ముదిసేలా లేదు. ఇరాన్ పని అయిపోయిందంటూ ప్రకటనలు చేస్తున్న ట్రంప్ అంతరంగంలో ఓటమి భయం మొదలైంది. నేడు యుద్ధ విరమణకు ఇరాన్ చట్టబద్ధమైన హక్కుల పరిరక్షణ, నష్టపరిహారం చెల్లింపు, భవిష్యత్తు దురాక్రమణకు వ్యతిరేకంగా హామీ ఇవ్వడం లాంటి మూడు షరతులను ఇరాన్ విధిస్తున్నది. ఇప్పటికైనా ట్రంప్, నెతన్యాహూ, మొజ్తాతా ఖమేనీలకు సత్వరమే సద్బుద్ధి కలగాలని, యుద్ధం ముగింపు దిశగా అడుగులు పడాలని, ప్రపంచ శాంతి నెలకొనాలని, ప్రపంచ మానవాళి కోరుకుంటున్నది.

# వినియోగదారుల హక్కులకు గుర్తింపు ఏదీ?

వస్తువులు, సేవల నాణ్యత, సామర్థ్యం, స్వచ్ఛత, ధర, ప్రమాణం.. వీటికి సంబంధించిన సమాచారాన్ని తెలుసుకొనే హక్కును కలిగి ఉండటమే వినియోగదారుల యొక్క హక్కు అని అర్థం. 1962, మార్చి 15న అమెరికా దిగువ సభలో వినియోగదారు హక్కుల బిల్లును ప్రతిపాదించగా అమెరికా మాజీ అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెనడి అమెరికా ప్రజలకు మొదటిసారిగా నాలుగు వినియోగదారుల హక్కులు ప్రకటించాడు. 1972లో అంతర్జాతీయ వినియోగదారుల సంఘాల సంస్థ ప్రాంతీయ సంచాలకుడు అన్వర్ ఫజల్ మార్చి15 తేదీని ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవంగా పరిగణించాలని తీర్మానించారు. దాంతో ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 20 సంఘాలు, సంస్థలు 1973 మార్చి 15 ని వినియోగ దారుల హక్కుల దినంగా పాటించాయి. భారత దేశంలో 1986లో వినియోగ దారుల ప్రయోజనార్థం, వారి హక్కుల పరిరక్షణ కోసం వినియోగ దారుల హక్కుల పరిరక్షణ చట్టం రూపొందించారు. భారత రాష్ట్రపతి ఆమోదంతో 1986 డిసెంబర్ 24న ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ చట్టం ప్రకారం వినియోగ దారులకు ఆరు హక్కులు ప్రకటించింది. వినియోగ దారుల రక్షణ మానవ ప్రాణాలకు, ఆస్తికి ప్రమాద కారక వస్తువులు, సేవల నుంచి రక్షణ పొందే హక్కు.. అవసరాలు తీర్చడమే కాకుండా, దీర్ఘకాలం మన్నే వస్తువులు, సేవలను పొందాలి. సమాచారం పొందే హక్కు..అవాంఛిత వ్యాపార కార్యకలాపాల నుంచి వినియోగ దారులకు రక్షణ కల్పించేందుకు వస్తు నాణ్యత, బరువు, స్వచ్ఛత, పుష్టి, ప్రమాణం గురించి తెలియ జేయాలి. నాణ్యమైన సేవలు పొందే సమాచారాన్ని తెలుసుకునే హక్కు ఉంది. వస్తువులను, సేవలను ఎంపిక చేసుకునే హక్కు...వివిధ రకాల వస్తువులు, సేవలు పొందేటప్పుడు వాటి మధ్య రేటు తెలుసు కోవడం మంచిది. సముచిత రేటులో నాణ్యత, సేవలు పొందడం. ప్రాతినిధ్యం వహించే హక్కు...వినియోగదారుల ఆసక్తిని, వారి అవసరాలను సరైన వేదికలు, ఫోరంలలో వినిపించడం. వినియోగదారుల సంక్షేమార్థం ఏర్పాటు చేసిన వివిధ వేదికలలో ప్రాతినిధ్యం వహించడం. వినియోగదారుల ఫోరంలో విజ్ఞప్తి చేయడం ద్వారా సేవాలోపాలు, వస్తు లోపాల నుండి పరిహారం పొందే హక్కు... వినియోగ దారులు మోసానికి గురయినప్పుడు ఫోరంలో కేసులు వేసి, తగిన పరిహారాన్ని పొందడం. వినియోగ దారుల విద్య హక్కు... వినియోగ దారులు నిరంతరం తమ హక్కులను తెలుసుకుంటూ, తమ జ్ఞానాన్ని పెంచు కోవడం, నైపుణ్యాలను పెంపొందించు కోవడం ఎంతో అవసరం. గ్రామీణ ప్రాంతాలలో వినియోగదారులు హక్కుల పట్ల అవగాహన లేక ఎంతో మోసపోతున్నారు. భారత ప్రభుత్వం 1989లో మార్చి 15వ తేదీని వినియోగ దారుల దినోత్సవంగా ప్రకటించింది. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం మనం ప్రపంచ వినియోగదారుల దినోత్సవాన్ని మార్చి 15 న జరుపుకుంటున్నాం. నూతన వ్యాపారాభివృద్ధి సంస్కరణల వల్ల ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ఆన్‌లైన్‌లో, ఈ-కామర్స్, టెలిషాపింగ్ విధానంలో వస్తువుల్ని కొనుగోలు చేస్తున్నారు. ప్రజలను మోసగించే సైబర్ నేరాలు దీని వల్ల చోటుచేసు కుంటున్నాయి. వినియోగ దారులను తప్పుడు ప్రకటనలు, సందేశాలతో మోసగించడం పెరిగి పోతున్నది. దీంతో వినియోగ దారుల హక్కుల రక్షణ కోసం కొత్త చట్టాల ఆవశ్యకత ఏర్పడింది. 1986నాటి చట్టం స్థానంలో 2019లో మరో చట్టాన్ని రూపొందించారు. అది ఈ 2020 సంవత్సరంలో అమలులోకి వచ్చింది. వాణిజ్య వ్యాపారాల్లో, ప్రభుత్వ యంత్రాంగంలో, సేవా సంస్థల్లో పనిచేసే వారు నిర్లక్ష్యంగా, మోస పూరితంగా వ్యవహరించినప్పుడు కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రపంచం లోని చట్టాలన్నింటి కన్నా మెరుగ్గా భారత దేశంలో తొలిసారి 1986లో వినియోగ దారుల హక్కుల పరిరక్షణ చట్టాన్ని రూపొందించారు. తక్కువ సమయంలో, అతి తక్కువ రుసుముతో, దళారుల ప్రమేయం లేకుండా జిల్లా, రాష్ట్ర, జాతీయ వినియోగదారుల ఫోరాల్ని, కమిషన్లను ఆశ్రయించి వ్యక్తిగతంగా సత్వర న్యాయం పొందే సౌలభ్యం దీని ద్వారా లభించింది. ఇప్పుడు సైబర్ నేరాల కారణంగా దాని స్థానంలో కొత్త చట్టాన్ని తెచ్చారు. ఈ నూతన చట్టాన్ని 2020 జూలై 20 నుంచి దేశవ్యాప్తంగా అమలు పరుస్తున్నారు. వినియోగదారులకు తక్కువ ఖర్చులో, ఇబ్బందులకు తావు లేని రీతిలో, శీఘ్రంగా ఫిర్యాదులను పరిష్కరించే వెసులుబాటు కల్పించాలనే సంకల్పంతో దేశ వ్యాప్తంగా వేరు వేరు స్థాయిలలో వినియోగదారు వేదికలను నెలకొల్పడం జరిగింది. వినియోగదారు రక్షణ చట్టంలోని 9వ సెక్షన్ మూడు అంచెల వివాద పరిష్కార సంస్థల ఏర్పాటుకు మార్గం సుగమం చేసింది. (ఎ) కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ ద్వారా ఏర్పాటు చేసే జాతీయ వినియోగదారు వివాదాల పరిష్కార సంఘం. ఈ కోర్టునే జాతీయ సంఘంగా వ్యవహరిస్తారు. (బి). కేంద్ర ప్రభుత్వం ముందస్తు అనుమతితో రాష్ట్ర ప్రభుత్వం ఒక నోటిఫికేషన్ ద్వారా ఏర్పాటు చేసే రాష్ట్ర వినియోగదారు పరిష్కార సంఘం. ఈ కోర్టునే రాష్ట్ర సంఘంగా కూడా వ్యవహరిస్తారు. (సి). రాష్ట్ర ప్రభుత్వం ఒక నోటిఫికేషన్ ద్వారా ఆ రాష్ట్రంలోని ప్రతి జిల్లాలోనూ ఏర్పాటు చేసే వినియోగదారు వివాదాల పరిష్కార వేదిక. ఈ కోర్టునే డిస్ట్రిక్ట్ ఫోరమ్ గా కూడా వ్యవహరిస్తారు. ఈ ఏజెన్సీలన్నీ వాటి స్వభావం, అధికారాల పరంగా క్వాసీ- జ్యుడీషియల్ యంత్రాంగంగా పని చేస్తాయి. జాతీయస్థాయిలో సెంట్రల్ కన్స్యూమర్ అథారిటీ అనే ప్రత్యేక వ్యవస్థను రూపొందించి తగిన విచారణాధికారాలు, విచక్షణాధికారాలు కల్పించారు. ఇందులో డైరెక్టర్ జనరల్ స్థాయి అధికారితో కూడిన కమిటీ ఉంటుంది. నేరాలకు పాల్పడినట్లు నిరూపితమైన వ్యక్తులపై, సంస్థలపై అవసరమైన చర్యలు తీసుకుంటారు. నూతన చట్టం ప్రకారం.. అరెస్టులు చేయించే అధికారం, మూడు సంవత్సరాల వరకు జైలు శిక్షను, పది లక్షల రూపాయల వరకూ జరిమానాను విధించే అధికారం సెంట్రల్ అథారిటీకి ఉంటుంది. జిల్లా కమిషన్లు ఇచ్చిన తీర్పులపై ఉన్నత రాష్ట్రస్థాయి కమిషన్‌ను ఆశ్రయించేందుకు వ్యతిరేక పార్టీ కనీసం యాభైశాతం లేదా రూ.25 వేలు రాష్ట్ర కమిషన్‌లో డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. గతంలో ఉన్న 30 రోజులకు బదులుగా 45 రోజులుగా కాలవ్యవధిని నిర్ణయించారు. రాష్ట్ర కమిషన్‌లో ప్రెసిడెంట్‌తో పాటు విధిగా నలుగురు సభ్యులుండాలి. రెండు బెంచీలు నిర్వహించి వినియోగ దారులకు సత్వర న్యాయం అందించేందుకు కృషిచేయాలి. ఈ మేరకు రాష్ట్రాలను కేంద్రం ఆదేశించింది. భవిష్యత్తులో జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో అధ్యక్షులు, సభ్యుల నియామకం కాలాన్ని ఐదేండ్లకు బదులు నాలుగేండ్లకు కుదించారు. గరిష్ఠ వయస్సు 65 ఏండ్లుగా నిర్ణయించారు. రాష్ట్ర లీగల్ సెల్ అథారిటీ ఆధ్వర్యంలో వినియోగ దారుల హక్కుల పరిరక్షణ గురించి విస్తృతంగా ప్రచారం చేయాలి. నూతన వినియోగ దారుల హక్కుల పరిరక్షణ చట్టంపై సమగ్ర అవగాహన కల్పించేందుకు పాఠశాలల్లో, కళాశాల, విశ్వ విద్యాలయాల్లో పాఠ్య పుస్తకాల్లో, పాఠ్యాంశాల్లో వినియోగ దారుల విద్య, చట్టం ప్రాధాన్యం, అమలుపై గురించి తెలియ జేయాలి.

# మసకబారుతున్న ఫీజురీయింబర్స్‌మెంట్ ఉద్దేశం

భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశంలో సామాజిక న్యాయం, సమాన విద్యా అవకాశాల సాధన అనేది కేవలం రాజ్యాంగబద్ధమైన లక్ష్యం మాత్రమే కాదు, అది ఒక తరం భవిష్యత్తును నిర్ణయించే కీలక శక్తి. ఈ క్రమంలోనే ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన అత్యంత సాహసోపేతమైన, మానవీయమైన పథకం 'ఫీజు రీయింబర్స్‌మెంట్'. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఆర్థిక కారణాల వల్ల ఉన్నత విద్యకు దూరం కాకూడదనే సత్సంకల్పంతో ప్రారంభమైన ఈ పథకం, గత రెండు దశాబ్దాలుగా లక్షలాది మంది జీవితాల్లో వెలుగులు నింపింది. ముఖ్యంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి హయాంలో ఈ పథకం ఒక విప్లవాత్మక మార్పుగా రూపుదిద్దుకుంది. అంతకుముందు వరకు కేవలం సంపన్న వర్గాలకు మాత్రమే పరిమితమైన ఇంజినీరింగ్, మెడిసిన్, ఫార్మసీ వంటి వృత్తి విద్యా కోర్సులు, ఈ పథకం పుణ్యమా అని మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోని సామాన్య రైతు బిడ్డలకు కూడా అందుబాటులోకి వచ్చాయి. సామాజికంగా వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మరియు ఈబీసీ వర్గాలకు చెందిన విద్యార్థులందరికీ 100 శాతం ఫీజు చెల్లింపు హామీని ప్రభుత్వం ఇవ్వడంతో, ఉన్నత విద్యలో ప్రవేశాల సంఖ్య అనూహ్యంగా పెరిగింది. గణాంకాలను పరిశీలిస్తే, ఈ పథకం అమలులోకి రాకముందు వృత్తి విద్యా కోర్సుల్లో చేరే గ్రామీణ విద్యార్థుల శాతం 20 కంటే తక్కువగా ఉండగా, 2010 నాటికి అది 50 శాతానికి పైగా చేరుకోవడం గమనార్హం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ఈ పథకం 'రీజినల్ అడ్మిషన్ అండ్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ' మార్గదర్శకాల ప్రకారం కొనసాగుతూ వస్తోంది. తెలంగాణలో ప్రతి ఏటా సుమారు 10 లక్షల మందికి పైగా విద్యార్థులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారు. ఇందుకోసం ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌లో సుమారు 5,000 నుండి 6,000 కోట్ల రూపాయల వరకు నిధులను కేటాయిస్తోంది. ఇందులో ట్యూషన్ ఫీజుతోపాటు విద్యార్థుల భోజన, వసతి ఖర్చుల కోసం ఇచ్చే మెస్ ఛార్జీలు కూడా కలిసి ఉంటాయి. అయితే, ఇంతటి ప్రతిష్టాత్మకమైన పథకం గత కొన్నేళ్లుగా తీవ్రమైన నిధుల కొరత మరియు పరిపాలనాపరమైన జాప్యంతో సతమతమవుతోంది. ప్రభుత్వం నుండి సకాలంలో నిధులు విడుదల కాకపోవడంతో బకాయిలు కొండలా పేరుకు పోతున్నాయి. తాజా నివేదికల ప్రకారం, గత రెండు మూడు విద్యా సంవత్సరాలకు సంబంధించి వేల కోట్ల రూపాయల బకాయిలు ఇంకా చెల్లింపులకు నోచుకోలేదు. ఈ పరిస్థితి అటు విద్యార్థులను, ఇటు విద్యాసంస్థలను అగమ్య గోచరంలోకి నెట్టి వేస్తోంది. ప్రైవేట్ కళాశాలలు ప్రధానంగా ఈ రీయింబర్స్‌మెంట్ నిధులపైనే ఆధారపడి నడుస్తుంటాయి. అధ్యాపకుల జీతాలు, భవనాల అద్దెలు, ల్యాబ్ నిర్వహణ మరియు ఇతర మౌలిక వసతుల కల్పన అంతా ఈ నిధులతోనే ముడిపడి ఉంటుంది. ప్రభుత్వం నుండి ఒకటి రెండు ఏళ్ల పాటు నిధులు రాకపోవడంతో అనేక చిన్న మరియు మధ్య తరహా కళాశాలలు మూతపడే దిశగా వెళు _న్నాయి. ఇది విద్యా ప్రమాణాల పతానానికి దారితీస్తోంది. మరోవైపు, ఈ బకాయిల భారానికి బలి అవుతున్నది మాత్రం నిరుపేద విద్యార్థులే. కళాశాల యాజమాన్యాలు తమ ఆర్థిక ఇబ్బందులను అధిగమించడానికి విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నాయి. ప్రభుత్వం నుండి డబ్బులు వచ్చే వరకు ఎదురు చూడలేమని, విద్యార్థులే స్వయంగా ఫీజులు చెల్లించాలని కొన్ని యాజమాన్యాలు కఠినంగా వ్యవహరిస్తున్నాయి. దీనివల్ల పరీక్షల సమయంలో హాల్ టికెట్లు నిలిపివేయడం, కోర్సు పూర్తయిన తర్వాత ఒరిజినల్ సర్టిఫికేట్లు మరియు మార్కుల మెమోలు ఇవ్వకుండా ఆపివేయడం వంటి సంఘటనలు రాష్ట్రవ్యాప్తంగా నిత్యకృత్య మయ్యాయి. ఉన్నత చదువులు చదివినా పట్టా చేతికి అందక, ఉద్యోగాల దరఖాస్తులకు అనర్హులుగా మారుతున్న వేలాది మంది యువతలో మానసిక ఆందోళన పెరుగుతోంది. తమ తప్పు లేకపోయినా, కేవలం ప్రభుత్వ చెల్లింపుల జాప్యం వల్ల తమ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్య వెనుక ఉన్న కారణాలను విశ్లేషిస్తే, ఆర్థిక ప్రాధాన్యతలలో మార్పులు మరియు పరిపాలనాపరమైన చిక్కులు ప్రధానంగా కనిపిస్తాయి. ప్రభుత్వాలు ప్రజాకర్షక పథకాలకు ప్రాధాన్యత ఇస్తూ, విద్యా రంగం వంటి దీర్ఘకాలిక పెట్టుబడి రంగాలను విస్మరిస్తున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బడ్జెట్ కేటాయింపులు కాగితాల మీద భారీగా కనిపిస్తున్నా, వాస్తవ విడుదల విషయంలో మాత్రం తీవ్ర జాప్యం జరుగుతోంది. అంతేకాకుండా, విద్యార్థుల ఆదాయ ధృవీకరణ పత్రాల తనిఖీ, కాలేజీల అఫిలియేషన్ ప్రక్రియలో ఉన్న సంక్లిష్టతలు కూడా నిధుల విడుదలకు అడ్డంకిగా మారుతున్నాయి. ఆధార్ అనుసంధానం, బయోమెట్రిక్ హాజరు వంటి సాంకేతిక సంస్కరణలు ప్రవేశపెట్టి నప్పటికీ, డేటా ప్రాసెసింగ్‌లో నెలకొన్న లోపాలు లబ్ధిదారులకు శాపంగా పరిణమించాయి. ఈ అనిశ్చితి వల్ల గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నత చదువులకు పంపించాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. విద్యా రంగ నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఈ సమస్యకు తక్షణ పరిష్కారం చూపకపోతే సామాజిక చలనం దెబ్బతింటుంది. అంటే, ఒక తరం తన ఆర్థిక స్థితిగతులను మార్చుకోవడానికి ఉన్న ఏకైక మార్గం విద్య. ఆ విద్యనే దూరం చేస్తే, పేదరికం వారసత్వంగా కొనసాగే ప్రమాదం ఉంది. మానవ వనరుల అభివృద్ధిని కాంక్షించే ఏ ప్రభుత్వమైనా విద్యను కేవలం ఒక సంక్షేమ ఖర్చుగా కాకుండా, దేశ ప్రగతికి పునాదిగా భావించాలి. ప్రస్తుత సంక్షోభం నుండి గట్టెక్కాలంటే ప్రభుత్వం ఒక నిర్దిష్టమైన కార్యాచరణను రూపొందించు కోవాలి. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ఏ త్రైమాసికానికి ఆ త్రైమాసికం విడుదల చేసే విధంగా ఒక 'గ్రీన్ ఛానల్' వ్యవస్థను ఏర్పాటు చేయాలి. బడ్జెట్‌లో కేటాయించిన నిధులను ఇతర పథకాలకు మళ్లించకుండా, కేవలం విద్య కోసమే వినియోగించేలా చట్టబద్ధమైన హామీ ఉండాలి. అలాగే, విద్యార్థుల ధృవీకరణ ప్రక్రియను మరింత సరళతరం చేస్తూ, పూర్తిస్థాయి డిజిటలైజేషన్ ద్వారా జాప్యాన్ని నివారించాలి. విద్యాసంస్థలు కూడా విద్యార్థుల సర్టిఫికేట్లను అడ్డుకోకుండా, ప్రభుత్వం నుండి వచ్చే బకాయిల కోసం చట్టబద్ధమైన పోరాటం చేయాలే తప్ప విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకో కూడదు. ప్రభుత్వం, విద్యాసంస్థలు మరియు విద్యార్థి సంఘాల మధ్య సమన్వయం కుదిరినప్పుడే ఈ పథకం తన అసలు లక్ష్యాన్ని చేరుకోగలదు. ముగింపుగా చెప్పాలంటే, ఒక దేశం యొక్క గొప్పతనం అది నిర్మించిన భవనాల్లో లేదు, అది తీర్చిదిద్దిన మేధావుల ఆలోచనల్లో ఉంటుంది. పేదరికం చదువుకు అడ్డంకి కాకూడదన్న రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడు కోవాల్సిన బాధ్యత పాలకులపై ఉంది. బకాయిలను వెంటనే చెల్లించి, విద్యార్థుల గుండెల్లో గూడుకట్టుకున్న ఆందోళన మబ్బులను తొలగించడమే నేటి తక్షణ అవసరం. అప్పుడే మన దేశ యువత ప్రపంచ వేదికపై సగర్వంగా నిలబడి, నవ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కాగలరు. విద్యార్థుల భవిష్యత్తుపై మబ్బులు వీడి, జ్ఞాన సూర్యుడు ప్రకాశించాలంటే ప్రభుత్వాల సంకల్పం దృఢంగా ఉండాలి.



# రాగిజావ.. ఇక టిఫిన్ అక్కర్లేదు

రాగి జావ చిరుధాన్యాల్లో ఒకటి. ఇది కాల్షియం, ఐరన్, పీచుపదార్థాలతో నిండిన ఆరోగ్యకరమైన అల్పాహారం. ఫెర్మెంటెడ్ రాగి జావ జీర్ణవ్యవస్థకు, బరువు తగ్గడానికి ఉపకరిస్తుంది. పిల్లలకు మెదడు అభివృద్ధి, ఎముకల పెరుగుదలకు తోడ్పడుతుంది. ఇది ముఖ్యంగా అల్పాహారంగా తీసుకోవడానికి అనువైనది. సమయం లేనివారు లేదా మార్పు కోరుకునే వారికి రాగి జావ ఒక మంచి ప్రత్యామ్నాయం. రాగుల్లో ఎన్నో పోషకాలు దాగున్నాయి.. అందుకే.. రాగి జావ మన దైనందిన ఆహారంలో చేర్చుకోవడానికి ఎంతో ఆరోగ్యకరమైన ఎంపిక అని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు.. వాస్తవానికి రాగులు చిరుధాన్యాల కోవకు చెందినవి.. రాగి జావ తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు, ఎవరు తీసుకోవాలి, ఎవరు తీసుకోకూడదు వంటి అంశాలను ఈ కథనంలో తెలుసుకుందాం.. రాగి జావలో కాల్షియం, ఐరన్, పీచుపదార్థాలు అధికంగా ఉంటాయి. ముఖ్యంగా ఉదయం అల్పాహారంగా రాగి జావ తీసుకోవడం వల్ల అనేక ప్రయోజనాలను పొందవచ్చు. ఇడ్లీ, దోశ వంటి సంప్రదాయ అల్పాహారాలకు సమయం లేని వారికి లేదా తేలికపాటి ఆహారాన్ని ఇష్టపడే వారికి రాగి జావ ఉత్తమ ప్రత్యామ్నాయం. ఇది శరీరానికి అవసరమైన పోషకాలను అందించి, రోజంతా శక్తివంతంగా ఉండటానికి సహాయపడుతుంది. మధుమేహులు రాగి జావ తీసుకునే విషయంలో కొన్ని జాగ్రత్తలు పాటించాలి. రాగి జావ గ్లైసెమిక్ ఇండెక్స్ మధ్యస్థంగా ఉండటం వలన, కొంతమందిలో రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగే అవకాశం ఉంది. అందువల్ల, మధుమేహులు రాగి జావను నివారించడం లేదా తప్పనిసరిగా తీసుకోవాలని భావిస్తే, పరిమిత మోతాదులో తీసుకుంటూ చక్కెర స్థాయిలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం మంచిది. రాగి జావను వివిధ రకాలుగా తయారుచేసుకోవచ్చు. దీనిని పాలు, మజ్జిగ లేదా పెరుగుతో కలిపి తీసుకోవచ్చు. అయితే, ఫెర్మెంటెడ్ రాగి జావ మరిన్ని ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. ఫెర్మెంటెడ్ రాగి జావ అంటే, ముందు రోజు రాగి పిండిని పులియబెట్టి, దానిని మరుసటి రోజు ఉదయం పెరుగు లేదా మజ్జిగతో కలిపి తీసుకోవడం. ఈ విధంగా తీసుకోవడం వల్ల ఇది మంచి ప్రీబయోటిక్‌గా పనిచేసి, జీర్ణవ్యవస్థ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. గట్ హెల్త్ బాగుంటుంది. అసిడిటీ, గ్యాస్ట్రిక్ సమస్యలున్న వారికి ఇది ఎంతో ఉపశమనం కలిగిస్తుంది. బరువు తగ్గాలనుకునే వారికి కూడా ఇది తేలికపాటి, పోషకమైన ఆహారంగా ఉపయోగపడుతుంది. ఉదయం పూట భారీగా కాకుండా తేలికగా, సౌకర్యవంతంగా ఉండాలనుకునే వారికి రాగి జావ ఒక అద్భుతమైన ఎంపిక.. చిన్నపిల్లలకు రాగి జావను మంచి స్నాక్‌గా ఇవ్వవచ్చు. పాఠశాల నుంచి వచ్చిన తర్వాత లేదా ఆకలిగా ఉన్నప్పుడు, రాగి జావలో కొద్దిగా బెల్లం, ఒక స్పూన్ స్వచ్ఛమైన ఆవు నెయ్యి కలిపి ఇవ్వడం వల్ల రుచితో పాటు ఆరోగ్యం కూడా లభిస్తుంది. ఆవు నెయ్యిలో ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు పుష్కలంగా ఉంటాయి, ఇవి పిల్లల మెదడు పనితీరు, జ్ఞాపకశక్తి అభివృద్ధికి ఎంతగానో తోడ్పడతాయి. అంతేకాకుండా, చిన్నపిల్లలకు ఎముకల పెరుగుదలకు అవసరమైన కాల్షియం రాగి జావ ద్వారా లభిస్తుంది. టీనేజర్లలో హిమోగ్లోబిన్ స్థాయిలు తక్కువగా ఉన్నట్లయితే, రాగి జావ తీసుకోవడం వల్ల అవి మెరుగుపడతాయి. ఎముకల అభివృద్ధికి కూడా ఇది సహాయపడుతుంది. మలబద్ధకంతో బాధపడేవారికి రాగి జావలోని పీచుపదార్థాలు ఎంతో ఉపకరిస్తాయి. ఇది జీర్ణవ్యవస్థను మెరుగుపరచి, మలబద్ధకం నుండి ఉపశమనం కలిగిస్తుంది. అందువల్ల, రాగి జావను రోజూ లేదా కనీసం వారానికి మూడు నుంచి నాలుగు సార్లు అయినా తీసుకోవడం వల్ల ఈ ప్రయోజనాలను పొందవచ్చు. ఇది ప్రకృతిసిద్ధంగా లభించే, మన శరీరానికి ఎంతో మేలు చేసే ఆహారం. ఆరోగ్యకరమైన జీవితం కోసం రాగి జావను మీ రోజువారీ ఆహారంలో భాగం చేసుకోండి.



# సమ్మర్‌లో చన్నీటి స్నానం చేస్తే..



ఎండలో తిరిగి అలిసిపోయి ఇంటికి రాగానే.. గొంతు ఎండిపోయి ఫ్రిజ్‌లో చల్లని నీళ్లు తాగాలని లేదా ఐస్ లాంటి చల్లని నీటితో స్నానం చేయాలని అనిపించడం సహజం. ఆ నిమిషానికి అది ఎంతో హాయిగా, తక్షణ ఉపశమనం ఇచ్చినట్లు అనిపించినా, ఈ అలవాటు మన శరీరానికి మేలు చేయడం కంటే హాని చేసే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. శరీర ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరించడంలో మన మెదడు చేసే సహజ ప్రక్రియకు ఈ అతి చల్లని నీరు పెద్ద ఆటంకం కలిగిస్తుంది. దీని వల్ల కలిగే దుష్ప్రభావాలు, అసలు ఎండాకాలంలో ఎలాంటి నీటితో స్నానం చేయాలో వివరంగా తెలుసుకుందాం. వేసవిలో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటినప్పుడు మన శరీరం తనను తాను చల్లబరుచుకోవడానికి నిరంతరం ప్రయత్నిస్తూ ఉంటుంది. ఈ క్రమంలో మనం తీసుకునే 'కోల్డ్ షవర్' నిర్ణయం శరీర సహజ ప్రక్రియకు విరుద్ధంగా మారుతుంది. అకస్మాత్తుగా చల్లని నీటిని శరీరంపై పోసుకోవడం వల్ల కలిగే ప్రధాన నష్టాలు ఇవే.. 1. శరీర ఉష్ణోగ్రత క్రమబద్ధీకరణలో ఆటంకం: బయట వేడి ఎక్కువగా ఉన్నప్పుడు, మన చర్మం దగ్గర ఉండే రక్తనాళాలు వ్యాకోచిస్తాయి. దీనివల్ల రక్త ప్రసరణ పెరిగి, చెమట రూపంలో అంతర్గత వేడి బయటకు పోయి శరీరం చల్లబడుతుంది. అయితే, మనం అకస్మాత్తుగా అతి చల్లని నీటిని పోసుకున్నప్పుడు, ఆ రక్తనాళాలు ఒక్కసారిగా కుంచించుకుపోతాయి. దీనివల్ల శరీరంలోని వేడి లోపలే ఉండిపోయి, బయటకు పోవడానికి మార్గం ఉండదు. అందుకే స్నానం చేసిన ఐదు నిమిషాలకే మీకు మళ్ళీ విపరీతమైన చెమట పట్టడం మొదలవుతుంది. 2. మెదడుకు తప్పుడు సంకేతాలు: చల్లని నీరు చర్మంపై పడగానే, అక్కడి సెన్సార్లు మెదడుకు "బయట వాతావరణం చల్లగా ఉంది" అనే తప్పుడు సమాచారాన్ని పంపుతాయి. దీనివల్ల మెదడు వేడిని బయటకు పంపే ప్రక్రియను ఆపివేసి, శరీరాన్ని వెచ్చగా ఉంచడానికి అంతర్గత ఉష్ణోగ్రతను పెంచుతుంది. అంటే మీరు చల్లబడాలని స్నానం చేస్తే, మీ శరీరం మాత్రం లోపల వేడిని పెంచుకుంటుందన్నమాట. 3. బాడీ షాక్, కండరాల నొప్పులు: ఎండలో తిరిగి వచ్చిన వెంటనే ఐస్ కోల్డ్ వాటర్ కింద నిలబడితే శరీరం 'షాక్'కు గురవుతుంది. దీనివల్ల హృదయ స్పందన రేటు ఒక్కసారిగా పెరగడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలగడం వంటివి జరుగుతాయి. గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారికి ఇది చాలా ప్రమాదకరం. అలాగే వేడికి రిలాక్స్ అయిన కండరాలు అకస్మాత్తుగా చల్లని నీరు తగలగానే బిగుసుకుపోయి నొప్పులకు దారితీస్తాయి. వేసవిలో అతి చల్లని నీటి కంటే గోరువెచ్చని నీరు లేదా సాధారణ గది ఉష్ణోగ్రత వద్ద ఉండే నీటితో స్నానం చేయడం ఉత్తమం. గోరువెచ్చని నీరు చర్మంపై పడినప్పుడు రక్త ప్రసరణ మెరుగుపడి, వేడి సహజంగా బయటకు పోతుంది. స్నానం ముగిసిన తర్వాత మన శరీరం క్రమంగా చల్లబడుతుంది, దీనివల్ల ఎక్కువ సేపు హాయిగా ఉంటుంది. తక్షణ ఉపశమనం కంటే దీర్ఘకాలిక ఆరోగ్యమే ముఖ్యం. ఎండలో నుంచి రాగానే కనీసం 15-20 నిమిషాలు విశ్రాంతి తీసుకుని, శరీరం సాధారణ స్థితికి వచ్చాక మాత్రమే స్నానం చేయడం అలవాటు చేసుకోండి!

# టైం అయిపోతోందని ఫాస్ట్‌గా తినేస్తున్నారా?



నేటి ఉరుకుల పరుగుల జీవితంలో మనకు దేనికీ తీరిక ఉండటం లేదు. కనీసం ప్రశాంతంగా కూర్చుని భోజనం చేయడానికి కూడా సమయం కేటాయించ లేకపోతున్నాం. ఆఫీసు పనుల ఒత్తిడిలోనో లేదా టీవీ, ఫోన్లు చూస్తూనో ఆహారాన్ని నమలడం మానేసి నేరుగా మింగేస్తుంటాం. పది నిమిషాల్లో ముగించాల్సిన భోజనాన్ని రెండు నిమిషాల్లోనే లాగించేస్తున్నాం. ఇలా వేగంగా తినడం వల్ల మనకు తెలియకుండానే అనేక తీవ్రమైన ఆరోగ్య సమస్యలను కొని తెచ్చుకుంటున్నాం. "అన్నం పరబ్రహ్మ స్వరూపం" అని మన పెద్దలు చెబుతుంటారు. ఆహారాన్ని గౌరవించి, నిమ్మళంగా నమిలి తినడం వల్ల ఆ శక్తి మన శరీరానికి పూర్తి స్థాయిలో అందుతుంది. కానీ ఈ 'ఫాస్ట్ ఈటింగ్' అలవాటు మన శరీరానికి ఒక నిశ్శబ్ద శత్రువులా మారుతోంది. వేగంగా తినడం వల్ల కలిగే ప్రధాన నష్టాలు ఇవే.. మనం ఆహారం తిన్నప్పుడు కడుపు నిండిందనే సంకేతం మెదడుకు చేరడానికి దాదాపు 20 నిమిషాల సమయం పడుతుంది. మనం వేగంగా తిన్నప్పుడు, మెదడుకు ఆ సంకేతం అందేలోపే అవసరానికి మించి ఎక్కువ ఆహారాన్ని తినేస్తాం. దీనివల్ల శరీరంలోకి అదనపు కేలరీలు చేరి, అతి త్వరగా బరువు పెరగడానికి దారితీస్తుంది.జీర్ణక్రియ అనేది నోటి నుంచే ప్రారంభమవుతుంది. ఆహారాన్ని బాగా నమిలినప్పుడు లాలాజలంలోని ఎంజైమ్లు కలిసి ఆహారం మెత్తగా మారుతుంది. వేగంగా తిన్నప్పుడు ఆహారం సరిగ్గా నలగదు. పెద్ద పెద్ద ముక్కలుగా కడుపులోకి వెళ్లడం వల్ల జీర్ణకోశంపై అదనపు భారం పడుతుంది. దీనివల్ల అజీర్తి, గ్యాస్, కడుపు ఉబ్బరం మరియు ఎసిడిటీ వంటి సమస్యలు నిరంతరం వేధిస్తాయి.వేగంగా తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పెరుగుతాయి. దీనిని నియంత్రించడానికి శరీరం ఎక్కువ ఇన్సులిన్‌ను విడుదల చేయాల్సి వస్తుంది. కాలక్రమేణా ఇది 'ఇన్సులిన్ రెసిస్టెన్స్'కు దారితీస్తుంది. ఫలితంగా టైప్-2 డయాబెటిస్ వచ్చే ప్రమాదం రెండింతలు పెరుగుతుందని పరిశోధనలు చెబుతున్నాయి.వేగంగా తినే వారిలో అధిక రక్తపోటు (ఃఖ), కొలెస్ట్రాల్ పెరగడం, నడుము చుట్టూ కొవ్వు పేరుకుపోవడం వంటి సమస్యల సమాహారమైన 'మెటబాలిక్ సింద్రోమ్' వచ్చే అవకాశం ఎక్కువ. ఇవన్నీ కలిసి చివరకు గుండె జబ్బులకు దారితీస్తాయి. డిస్ట్రాక్షన్స్ వద్దు- భోజనం చేసేటప్పుడు మొబైల్ ఫోన్, టీవీ లేదా ల్యాప్‌టాప్ చూడటం మానేయండి. కేవలం ఆహారంపైనే దృష్టి పెట్టండి. సమయం కేటాయించండి- భోజనం కోసం కనీసం 20 నిమిషాల సమయాన్ని కేటాయించుకోండి. భోజనానికి అరగంట ముందు నీరు తాగండి, కానీ తింటున్నప్పుడు ఎక్కువగా తాగకండి.

మనం ఏమి తింటున్నామనేది ఎంత ముఖ్యమో, ఎలా తింటున్నామనేది కూడా అంతే ముఖ్యం. నిమ్మళంగా తినడం వల్ల ఆహారం రుచిని ఆస్వాదించడమే కాకుండా ఆరోగ్యంగా కూడా ఉండవచ్చు. నేటి నుంచే మీ భోజన వేగాన్ని తగ్గించి, సంపూర్ణ ఆరోగ్యం వైపు అడుగులు వేయండి.



# మోషన్ ఫ్రీగా అవ్వడం లేదా?

కుప్పింటాకు ప్రకృతి ప్రసాదించిన అద్భుత ఔషధం. ఇది కండరాల నొప్పులను తగ్గించడంలో, డయాబెటిక్ పుండ్లను మాన్పడంలో, ఆస్తమా, బ్రోంకైటిస్ వంటి శ్వాసకోశ సమస్యలను నివారించడంలో సహాయపడుతుంది. అలాగే, మలబద్ధకం, చెవి ఇన్ఫెక్షన్లకు కూడా ఉపశమనాన్నిస్తుంది. ప్రకృతి వైద్య విధానంలో మందులు లేకుండా జబ్బులు తగ్గించుకోవడానికి మంచి ఆహార నియమాలు, అలవాట్లను మార్చుకోమని సూచిస్తారు. అయితే, కొద్దిమందికే ఈ నియమాలను పాటించడం ఇష్టమవుతుంది. చాలామందికి ఆహారపు అలవాట్లను మార్చుకోవడం కష్టంగా అనిపిస్తుంది. అలాంటి వారి కోసం, కొన్ని రకాల సమస్యలను తగ్గించుకోవడానికి ప్రకృతి సిద్ధమైన ఔషధాలు, ఆకులు ఎంతగానో ఉపయోగపడతాయి. ఆయుర్వేద వైద్యులు అందించబడిన ఈ సమాచారం ప్రకారం, కుప్పింటాకు ఐదు రకాల ఆరోగ్య లాభాలను అందిస్తుంది. 1. కండరాల నొప్పుల నివారణ: కుప్పింటాకు కషాయం కండరాల నొప్పుల నుండి తక్షణ ఉపశమనాన్ని ఇస్తుంది. ఐదారు ఆకులను నీటిలో మరిగించి, ఆ నీటిని త్రాగడం వల్ల ఇందులో ఉండే పాలిఫినాల్స్, ఇతర రసాయన సమ్మేళనాలు కండరాలను రిలాక్స్ చేస్తాయి. కండర కణాలలో వచ్చే వాపును తగ్గించి, నొప్పులకు కారణమయ్యే ప్రోస్టాగ్లాండిన్స్ ఉత్పత్తిని తగ్గించడంలో ఇది సమర్థవంతంగా పనిచేస్తుంది. అలసటగా, నొప్పులుగా ఉండే కండరాలకు కుప్పింటాకు రసం సైంటిఫిక్‌గా ప్రయోజనకరంగా ఉంటుందని రుజువైంది. 2. డయాబెటిక్ పుండ్లు, గాయాల మానుపు: డయాబెటిస్ ఉన్నవారికి దెబ్బలు, పుళ్ళు, గాయాలు మానడం కష్టమవుతుంది, కొన్నిసార్లు గ్యాంగ్రీన్ వంటి తీవ్ర సమస్యలకు దారితీస్తుంది. మానకుండా ఉన్న అలాంటి గాయాలపై కుప్పింటాకు రసాన్ని వేయడం వల్ల ప్రయోజనం ఉంటుంది. ఈ రసంలో ఉండే గ్యాలిక్ ఆసిడ్, ఎలాజిక్ ఆసిడ్ యాంటీ ఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు కలిగి ఉంటాయి. ఇవి గాయం ప్రాంతంలోని బ్యాక్టీరియా, ఫంగస్ క్రిములను చంపి, వాపును తగ్గించి, పుండు మానడానికి తోడ్పడతాయి. అంతేకాకుండా, పుండు భాగంలో కొలాజన్ మెష్ ఏర్పడటాన్ని ప్రోత్సహించి, సాధారణ చర్మం వేగంగా అభివృద్ధి చెందడానికి సహాయపడుతుంది. 3. శ్వాసకోశ ఆరోగ్యానికి (ఆస్తమా, దగ్గు, కఫం): కుప్పింటాకులో ఉండే సపోనిన్స్, ఫినాల్స్ ఆస్తమా, దగ్గు, కఫం, శ్లేష్మాలు ఎక్కువగా ఉన్నవారికి, ఊపిరితిత్తులలో వాపు (బ్రోంకైటిస్) ఉన్నవారికి ఉపయోగపడతాయి. ఐదారు కుప్పింటాకులను నీటిలో మరిగించి, వడకట్టిన కషాయానికి తేనె కలుపుకొని త్రాగడం వల్ల ఊపిరితిత్తులలో శ్లేష్మం ఉత్పత్తి చేసే కణాల అతి క్రియాశీలతను తగ్గిస్తుంది. ఇది శ్లేష్మాన్ని, వాపును సహజంగా తగ్గించి, ఆస్తమా మరియు బ్రోంకైటిస్ రోగులకు ఊపిరితిత్తులలోని కండరాలను రిలాక్స్ చేయడానికి సహాయపడుతుంది. ఎలుకల పైన చేసిన పరిశోధనల ద్వారా కుప్పింటాకు ఊపిరితిత్తుల వాపును, ఆయాసం, కఫం, దగ్గును తగ్గించడంలో ఉపయోగపడుతుందని రుజువైంది. 4. మలబద్ధకం నుండి ఉపశమనం: కొంతమందికి మలద్వారం వద్ద స్పింక్టర్ బాగా బిగుతుగా ఉండటం వల్ల మోషన్ సరిగా అవ్వదు. అలాంటి వారికి కుప్పింటాకు ముద్దను తయారుచేసి, మలద్వారంలో ఉంచితే ఆ స్పింక్టర్ రిలాక్స్ అయ్యి మోషన్ ఫ్రీగా అవ్వడానికి సహాయపడుతుంది.

# ఆర్‌వోబీ ఆగమాగం

**రెండు నెలలుగా మూసివేసిన తాంసి బస్టాండ్ గేటు**

**రైతులు, జనం ఇబ్బందులు.. నష్టపోతున్న వ్యాపారులు**

**ఆదిలాబాద్ :** ఆదిలాబాద్ పట్టణంలోని రైల్వే క్రాసింగ్‌ల వద్ద వాహనదారుల ఇబ్బందులను తొలగించడంతోపాటు ట్రాఫిక్ సమస్య నివారణకు చేపట్టిన రైల్వే ఓవర్ బ్రిడ్జి పనుల్లో జాప్యం కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్‌వోబీ) పనులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.97.20 కోట్ల అంచనాతో చేపట్టారు. ఇందులో రాష్ట్రం వాటా రూ.57.20 కోట్లు కాగా, కేంద్రం వాటా రూ.39.4 కోట్లుగా నిర్ణయించారు. వంతెన పొడువు 931.825 మీటర్లు కాగా మూడున్నర సంవత్సరాల కిందట పనులు ప్రారంభమయ్యాయి. రైల్వే ట్రాక్ భాగంలోని పనులను రైల్వేశాఖ, మిగత పనులను రోడ్లు అండ్ భవనాల శాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. పనులు సకాలంలో పూర్తి చేయాల్సి ఉండగా.. ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా తీవ్ర జాప్యం జరుగుతున్నది. దీంతో ప్రజలు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. +వశీస్త్రతీఖుజూష్ట్రఅష =వటవతీవఅష్వ




**రెండు నెలలుగా గేటు మూసివేత**

తాంసి బస్టాండ్ వద్ద రైల్వే కింద వంతెనను రూ.20 కోట్లతో నిర్మాణ పనుల చేపట్టాల్సి ఉండగా.. రెండు నెలల కిందట తాంసి బస్టాండ్ వద్ద గేటును అధికారులు మూసివేశారు. అప్పటి నుంచి పనులు చేపట్టకపోవడంతో ప్రజలు, రైతులు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. రైల్వే గేటు సమీపంలో మార్కెట్ యార్డు ఉండడంతో రైతులు పంటలు విక్రయించడానికి వస్తుంటారు. ప్రస్తుతం మార్కెట్ యార్డులో కందుల కొనుగోలు జరుగుతుండడంతో రైతులు ఆర్టీవో కార్యాలయం మీదుగా ఐదు కిలోమీటర్ల దూరం నుంచి వెళ్లాల్సి వస్తుంది. గేటుకు అవతలి పక్కన భాగ్యనగర్, తాటిగూడ, క్రాంతినగర్, ఇంద్రనగర్, గడియార్ మహేల, గాంధీనగర్, అమన్‌కాలనీతోపాటు ఇతర ప్రాంతాలున్నాయి.తాజా తెలుగు వార్తలు మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాలతోపాటు తాంసి, భీంపూర్ మండలాలకు వెళ్లాల్సిన వాహనాలు ఇక్కడి నుంచి వెళ్లాల్సి వస్తున్నది. రెండు నెలలుగా గేటు మూసివేయడంతో ఎలాంటి పనులు జరగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్‌కు, ఇతర పనుల కోసం రావాలంటే రెండు ఆటో ఛార్జీలు చెల్లించాల్సి వస్తుందని అంటున్నారు. తాంసి బస్టాండ్ ప్రాంతంలో రెండు వందలకు పైగా వ్యాపారులు ఉపాధి పొందుతారు. గేటు మూసివేసిన ఫలితంగా జనాలు రాకపోవడంతో వారి వ్యాపారులు నిలిచిపోయి ఉపాధి నష్టపోతున్నారు. పనులను ప్రారంభించాలని లేదా గేటును ఓపెన్ చేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులను పలుమార్లు కోరినా ఫలితం లేదని ప్రజలు అంటున్నారు. రైల్వే గేటూ మూసివేత విషయంలో స్థానిక ప్రజాప్రతినిధులపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధి పనుల పేరిట ప్రజలను ఇబ్బందులు పెట్టవద్దని కోరుతున్నారు.

# మొరంపై కన్ను అధికారులే దన్ను

**జేబులు నింపుకుంటున్న అక్రమార్కులు**

**పట్టించుకోని రెవెన్యూ, మైనింగ్ అధికారులు**

**యథేచ్ఛగా తరలుతున్న మట్టి**

**సారంగాపూర్ :** ప్రభుత్వ భూములు, గుట్టలపై అక్రమార్కులు కన్నేశారు. అక్రమంగా మొరం మట్టి తరలించి జేబులు నింపుకొంటున్నారు. రెవెన్యూ, మైనింగ్ యంత్రాంగం పట్టనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని జామ్ కరిశలగుట్ట, సారంగాపూర్‌లోని అంబవాయి చెరువు, దేవుల్లగుట్ట, బీరవెల్లి గుట్ట, స్వర్ణలో అటవీ, ప్రభుత్వ భూముల నుంచి శని, ఆదివారాలు అక్రమార్కులు మొ రం మట్టిని తరలిస్తున్నారు. మై నింగ్‌శాఖ అనుమతి తప్పనిసర న్న నిబంధన ఉన్నా.. దానిని యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు తవ్వకాలు జరుపుతున్నారు. గ్రామంలో మొరం మట్టి ఒ క్కొక్క ట్రాక్టర్‌కు రూ.350 నుంచి రూ.400, దూరప్రాంతాలకు అయితే రూ.1000 నుంచి రూ.2వేలు, టిప్పర్ మట్టికి రూ.10 వేలకు విక్రయిస్తున్నారు. నిత్యం లక్షల విలువ చేసే మట్టిని తరలిస్తుండడం గమనార్హం. అధికారుల కళ్లేదుట మట్టి దందా జరుగుతున్న అడ్డుకొనే వారే లేరు.




**గుట్టలు, చెరువులు ఖాళీ**

సారంగాపూర్ మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. పునాదులు నింపేందుకు మట్టి అవసరం. రోజు ఇళ్ల నిర్మాణాలకు వందకుపైగా ట్రాక్టర్లు తరలిపోతున్నాయి. గ్రామాల్లో గుట్టలు కరిగిపోతున్నాయి. ప్రభుత్వ భూములు, చెరువుల్లో పెద్ద గుంతలు ఏర్పుతున్నాయి. దీంతో ప్రమాదకరంగా మారడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. మొరంమట్టి రవాణాకు కొందరు అక్రమార్కులు జేసీబీలు, ట్రాక్టర్లును కొనుగోలు చేయడం గమనార్హం. మొరం మట్టి పెద్ద మొత్తంలో అక్రమ రవాణ జరుగుతున్న అధికారులు మూమూళ్ల మత్తులో మునిగి తేలుతున్నరన్న ఆరోపణలు గుప్పుమంటున్నారు. అధికారులు పట్టించుకొని మొరం మట్టి దందాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

**మైనింగ్ శాఖ అనుమతి ఇవ్వాలి..**

మొరం తవ్వకాలకు మైనింగ్‌శాఖ అధికారులు పర్మిషన్ ఇవ్వాలి. మొరం అవసరం ఉన్న వారు దరఖాస్తు పెట్టుకుంటే మైనింగ్ శాఖ అధికారులకు పంపుతాం. అక్కడి నుంచి పర్మిషన్ వస్తే మొరం తవ్వుకోవడానికి వీలు ఉంటుంది. సారంగాపూర్ మండలంలోని మొరం తరలించడానికి ఎలాంటి అనుమతులు లేవు. మొరం మట్టి అక్రమ దందాను అరికట్టడానికి చెక్‌పోస్టులు పెట్టాం. -- సంధ్యారాణి, తహసీల్దార్, సారంగాపూర్.

# ఇంకా పక్షం రోజులే..
# ఏదులాపురం మున్సిపాలిటీ లక్ష్యం చేరుకునేనా ?

**ఖమ్మం :** 2025-26 సంవత్సరానికి గాను మున్సిపల్ రాష్ట్ర శాఖ నిర్దేశించిన లక్ష్యం ఏదులాపురం మున్సిపాలిటీ చేరుకునేనా అనే సందేహం మున్సిపల్ సిబ్బందిలో వ్యక్తం అవుతుంది. రాష్ట్ర శాఖ నిర్దేశించిన గడువు మరో పక్షం రోజులు మాత్రమే ఉండడంతో ఈ మేరకు టార్గెట్ చేరుకునేందుకు మున్సిపల్ యంత్రాంగం మల్లగుల్లాలు పడుతుంది. ముఖ్యంగా ఇంటి పన్ను వసూలు, ట్రేడ్ లైసెన్సుల జారీ, త్రాగునీటి నల్లాల ఆన్‌లైన్ వంటి నిర్దేశిత లక్ష్యాలను చేరుకునేందుకుగాను సిబ్బంది తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. 2025 మార్చి నుండి 2026 మార్చి వరకు రాష్ట్ర మున్సిపల్ శాఖ ఏదులాపురం మున్సిపాలిటీకి ఇంటి పన్నులకు సంబంధించి రూ.8.21 కోట్లను టార్గెట్ పెట్టడం జరిగింది. పాత పంచాయతీల పన్నువసూళ్లను ఆధారంగా లక్ష్యాన్ని ఇచ్చారు. అయితే నేటి వరకు రూ.4.18 కోట్ల ఇంటి పన్నులు వసూలు కావడం జరిగింది. అంటే దాదాపుగా 47 శాతం మాత్రమే లక్ష్యాన్ని చేరుకోవడం జరిగినట్లు అయింది. 100కు 100 శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని రాష్ట్ర మున్సిపల్ శాఖ ఆదేశాలు జారీ చేయడంతో మిగిలిన పక్షం రోజుల్లో రూ.4.20 కోట్ల నిధులను ఇంటి పన్నులను వసూలు చేయాల్సి ఉంది.

దీనికి తోడు మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 340 వ్యాపార సముదాయాలు ఉన్నట్లు గుర్తించినప్పటికీ వాటిలో కేవలం 200 వ్యాపార సముదాయాలకు మాత్రమే ట్రేడ్ లైసెన్సులు జారీ చేయగా మరో 140 వ్యాపార సముదాలకు ట్రేడ్ లైసెన్సులు జారీ చేయాల్సి ఉంది. వీటితో పాటు మున్సిపాలిటీ పరిధిలో 32 వార్డుల్లో కలిపి అధికారుల గణాంకాల ప్రకారం 6,700 త్రాగునీటి నల్ల కలెక్షన్లు ఉండగా నేటి వరకు కేవలం 3 వేల నల్లాలను మాత్రమే ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. ఇలా అనేక ఆన్‌లైన్ ఆఫ్‌లైన్ ప్రక్రియలో నిర్దేశించిన లక్ష్యాలకు దూరంగా ఉండటం ప్రస్తుతం మున్సిపల్ అధికారులు, సిబ్బందిని ఆలోచనలోకి నెట్టేసింది. ప్రధానంగా మున్సిపాలిటీ సిబ్బంది సరిపడా లేకపోవడంతో అనేక ఇబ్బందులను ఎదుర్కోవడం జరుగుతుంది.




**తీవ్రంగా వేధిస్తున్న సిబ్బంది కొరత**

ప్రస్తుత 32 వార్డుల మున్సిపాలిటీ పరిధిగాను కనీసం 72 మంది వివిధ సెక్షన్లలో కలిపి ఉద్యోగులు సేవలు అందించాల్సి ఉండగా కేవలం 12 మంది మాత్రమే సేవలు కొనసాగిస్తున్నారు. దీంతో అనేక పన్ను వసూలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు ఆశించిన మేర ముందుకు సాగడం లేదు. 32 వార్డులకు గాను 32 మంది వార్డ్ ఆఫీసర్లు ఉండాల్సి ఉండగా కేవలం ఐదు ఆరుగురితో మాత్రమే నెట్టుకొస్తున్నారు. వీరికి సైతం ఇతర అనేక సెక్షన్లు అప్పగించడంతో ఒక అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కు అన్నట్లు మున్సిపల్ నిర్వహణ కొనసాగుతుంది. ఏది ఏమైనా అత్యంత రెవెన్యూ గల మున్సిపల్ కావడం పన్ను చెల్లింపులకు ప్రజల నుండి మంచి స్పందన సైతం కనబడుతున్నప్పటికీ పన్ను వసూలు చేసే సిబ్బంది పూర్తిస్థాయిలో లేకపోవడంతో ఈ ఆర్థిక సంవత్సరానికి మున్సిపాలిటీ టార్గెట్ రీచ్ అవుతుందా లేదా అనేది వేచి చూడాలి.

## రాబరీ కేసులో నలుగురు అరెస్టు
## రూ.13.35 లక్షల విలువైన సొత్తు స్వాధీనం

**సూర్యాపేట :** రాబరీ కేసు సూర్యాపేట జిల్లా సిసిఎస్, ఆత్మకూరు పోలీసులు ఛేదించారు. నలుగురు నిందితులను అరెస్ట్ చేసారు. నిందితులపై తొమ్మిది కేసులు వున్నట్లు గుర్తించారు. కేసు వివరాలు అరెస్టు వివరాలను జిల్లా ఎస్పీ నరసింహ వెల్లడించారు. నిందితులు కంచుకొమ్ముల సంతోష్, కంచుకొమ్ముల గణేష్, షేక్ నశ్రీన్, కంచుకొమ్ముల సాయికిరణ్ ఒక ముఠాగా ఏర్పడి ఆటోలను దొంగలించి ప్రయాణం చేస్తూ ఒంటరిగా ప్రయాణిస్తున్న వృద్ధ మహిళలను లక్ష్యంగా చేసుకుంటారు. వృద్ధ మహిళ ను బెదిరించి ఆభరణాలు దొంగలించడం, దొంగలించిన ఆటోలోనే తిరుగుతూ రాత్రివేళ తాళాలు వేసిన ఇండ్లలో దొంగతనం చేస్తారని అన్నారు. సూర్యాపేట కోదాడ ప్రాంతాలకు చెందిన వీరు ముఠాగా ఏర్పడి ఈనెల 6 తేదీన ఆత్మకూర్ ఎస్ మండల పరిధిలోని కోటి నాయక్ తండ శివారులో ఒక వృద్ధురాలిని ఆటోలో ఎక్కించుకుని కొంత దూరము తీసుకువెళ్లి వృద్ధురాలని చంపుతామని బెదిరించి ఆమె నోరు మూసి ఆమె మెడలో ఉన్న వెండి గొలుసు దొంగలించుకున్నారు. దీనిపై ఆత్మకూరు పోలీస్ స్టేషన్ లో రాబరీ దొంగతనం కేసు నమోదు చేయడం జరిగింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా జిల్లా సిసిఎస్ పోలీసులు ఆత్మకూరు పోలీసులు నేరానికి పాల్పడ్డ వారిని టెక్నాలజీ ద్వారా గుర్తించి శనివారం ఉదయం 6 గంటల సమయంలో ఆత్మకూరు మండల పరిధిలోని ఎనుబాముల గ్రామ స్టేజీ వద్ద సిసిఎస్ ఇన్స్పెక్టర్, ఆత్మకూరు ఎస్సై ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తుండగా పట్టుకున్నారు. నిందితులనుంచి 3 లక్షల విలువైన 18 గ్రాముల బంగారం, 5 లక్షల విలువైన 1.5 కేజీల వెండి మరియు 4 లక్షల విలువైన 3 ఆటోలు, 50 విలువైన ట్యాబ్, ల్యాప్ టాప్, 1 బైకు, 1 టీవి, 2 సెల్ ఫోన్లు సీజ్ చేసారు.

## విట్ట శ్రీనివాస్ రెడ్డి అంతిమయాత్రలో ఎమ్మెల్యే మేఘారెడ్డి.

**వనపర్తి :** తన చివరి మజిలీకి శ్రీనివాస్ రెడ్డి ని భుజాలపై మోసిన ఎమ్మెల్యే.కన్నీటి పర్యంతమై కడసారి వీడ్కోలు చెప్పారు.తెలియని పాశం వెంటపడి రుణం తీర్చుకోమంటుంది నీ భుజం మార్చుకోమంటుంది అని ఆనాడు ఆచార్య ఆత్రేయ రాసిన గీతం నేటికీ ప్రతి ఒక్కరిని కంటతడి పెట్టిస్తుంది.సరిగ్గా అలాంటి సన్నివేశమే నేడు పెద్దమందడి మండలం అమ్మపల్లి లో చోటుచేసుకుంది.ఎంతో మంది మదిలో సుస్థిర స్థానం సంపాదించుకొని ప్రజా నాయకుడిగా పేరొంది అశువులు బాసిన నాయకుడి అంతిమయాత్రలో ఎమ్మెల్యే మేఘారెడ్డి పాల్గొని శ్రీనివాస్ రెడ్డి పాడేమోశారు×బిశ్రీనివాస్ రెడ్డి మరణ వార్త తెలుసుకున్న ఎమ్మెల్యే శుక్రవారం రాత్రి అమ్మపల్లి చేరుకునీ ఆయన మృతదేహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు.శనివారం ఉదయం 10 గంటలకు అమ్మపల్లి చేరుకొని ఆయన అంతిమయాత్రలో పాల్గొన్నారు.మూడు, నాలుగు గంటల పాటు అక్కడే ఉన్న ఎమ్మెల్యే ఆయన పాడె మోసి కన్నీటితో చివరి వీడ్కోలు పలికారు.ఆస్తుల కంటే ఆప్తులను సంపాదించుకోవడమే అసలైన జీవితం అని శ్రీనివాస్ రెడ్డి అంతిమ యాత్ర కనులకు కట్టినట్లుగా చూపించిందంటూ ఆయన తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు

## మార్చి 26 నుంచి ఆర్టీసీ సమ్మె

**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ సిబ్బంది ఆందోళన బాట పట్టనున్నారు. సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందంటూ కార్మిక సంఘాలు సమ్మె సైరన్ మోగించాయి. మార్చి 13న డెడ్‌లైన్ విధించినప్పటికీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో శుక్రవారం ఆర్టీసీ యాజమాన్యానికి జాయింట్ యాక్షన్ కమిటీ అధికారికంగా సమ్మె నోటీసును అందజేసింది. ఈ నిర్ణయం రాష్ట్రవ్యాప్తంగా రవాణా వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం కనిపిస్తోంది. ఆర్టీసీ కార్మికుల సమస్యలపై గత నెలలోనే ప్రభుత్వాన్ని హెచ్చరించాయి. మార్చి 13లోగా పరిష్కారం లభించకపోతే అసెంబ్లీ ముట్టడిస్తామని, ఆపై సమ్మెకు దిగుతామని స్పష్టం చేశాయి. అయితే ప్రభుత్వం నుంచి ఆశించిన స్థాయిలో కదలిక లేకపోవడంతో ఆర్టీసీ ఎండీ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌కు, అలాగే కార్మిక శాఖ కమిషనర్‌కు నాయకులు సమ్మె నోటీసులు అందజేశారు. చట్టప్రకారం 14 రోజుల నోటీసు పిరియడ్ తర్వాత అంటే మార్చి 26 తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా బస్‌లు నిలిపివేసి సమ్మె ప్రారంభించనున్నట్టు జేఏసీ స్పష్టం చేసింది. ఆర్టీసీ జేఏసీ నేతృత్వంలో మొత్తం 31 డిమాండ్లతో కూడిన నివేదికను యాజమాన్యానికి సమర్పించారు. ఇందులో ఆర్థికపరమైన అంశాలతోపాటు సంస్థ మనుగడకు సంబంధించిన కీలక డిమాండ్లు ఉన్నాయి. ఆర్టీసీని పూర్తిగా ప్రభుత్వంలో విలీనం చేసి, పని చేస్తున్న ఉద్యోగులందరికీ ప్రభుత్వ ఉద్యోగుల హోదా కల్పించాలని ప్రధానంగా డిమాండ్ చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2017 నాటి వేతన సవరణను అమలు చేసినప్పటికీ , దానికి సంబంధించిన ఎరియర్స్‌ను ఇంకా చెల్లించలేదు. సుమారు 2,150 కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కార్మికులు కోరుతున్నారు. 2021 నాటి వేతన సవరణను 30 శాతం ఫిట్‌మెంట్‌తో తక్షణమే ప్రకటించి, అమలు చేయాలని జేఏసీ డిమాండ్ చేస్తోంది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీకి రావాల్సిన నిధుల్లో కోత విధిస్తున్నారని కార్మికులు ఆరోపిస్తున్నారు. నెలకు 350 కోట్ల చొప్పున ఎటువంటి మినహాయింపులు లేకుండా ఆర్టీసీకి చెల్లించాలని వారు కోరుతున్నారు. గత ప్రభుత్వం నుంచి రావాల్సిన 2500 కోట్ల పాత బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు. సంస్థను కాపాడుకోవడంలో భాగంగా ఈవీ బస్‌ల నిర్వహణపై జేఏసీ కీలక వ్యాఖ్యలు చేసింది. ఎలక్ట్రిక్ బస్‌లను ప్రైవేటు సంస్థలకు అప్పగించకుండా, ఆర్టీసీ ద్వారానే నడపాలని, తద్వారా సంస్థ ఆదాయాన్ని పెంచుకోవచ్చని సూచించింది. మహాలక్ష్మి పథకం అమలులోకి వచ్చిన తర్వాత బస్సుల్లో ప్రయాణికుల రద్దీ విపరీతంగా పెరిగింది. దీని వల్ల కండక్టర్లు, డ్రైవర్లపై పని భారం అధికమైందని, దీనిని తగ్గించేలా చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు. మరోవైపు ఆర్టీసీలో ట్రేడ్ యూనియన్లపై ఉన్న ఆంక్షలను ఎత్తివేసి, తక్షణమే గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. దీని వల్ల కార్మికులకు తమ సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లేందుకు ఒక ప్రజాస్వామ్య వేదిక లభిస్తుందని వారు భావిస్తున్నారు.

## నందిమేడారంలో ఘనంగా గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు



**ధర్మారం :** పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నంది మేడారం గ్రామంలోని నంది రిజర్వాయర్ సమీపాన శనివారం గంగ పుత్రుల ఆరాధ్య దైవం శ్రీ గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. నూతనంగా శ్రీ గంగమ్మ తల్లి గుడిని నిర్మించారు. ఈ క్రమంలో స్థానిక గంగపుత్ర సంఘం, శ్రీ గంగాదేవి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాలను నిర్వహించారు. ఉత్సవాలు ఈ నెల 12 నుంచి ప్రారంభమైనాయి. దీంతో ఉత్సవాల ముగింపు సందర్భంగా శనివారం నూతనంగా నిర్మించిన గుడిలో శ్రీ గంగమ్మ తల్లి విగ్రహాన్ని అంగరంగ వైభవంగా ప్రతిష్టించారు. శ్రీ గంగమ్మ తల్లి తో పాటు గణపతి, శివలింగం పార్వతి, నందీశ్వరుడు, మకరం దేవి విగ్రహాలను కూడా గుడిలో ప్రతిష్టించారు. శ్రీ గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన అనంతరం భక్తులు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు సమర్పించారు.

# హెచ్‌పిసిఎల్‌కు యుద్ధం సెగ

## మార్గమధ్యంలోనే ఆగిపోయిన చమురు ట్యాంకర్లు

ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధంతో విశాఖలోని హెచ్‌పిసిఎల్ క్రూడ్ ఆయిల్ ట్యాంకర్ల దిగుమతికి ఆటంకం ఏర్పడింది. ఇప్పటికే మార్గమధ్యంలో మూడు ముడి చమురు ట్యాంకర్లు నిలిచిపోయాయి. విశాఖ పోర్టు ద్వారానే ఈ ఎగుమతి, దిగుమతుల ప్రక్రియ నిత్యం జరుగుతుండడంతో కేంద్ర పోర్టులు, షిప్పింగ్ మంత్రిత్వ శాఖ అప్రమత్తమై విశాఖ పోర్టు అధికారులను ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించాలని మూడు రోజులుగా చెబుతోంది. యుద్ధం మొదలై రెండు వారాలు కావొస్తుండటంతో వైజాగ్ పోర్టు అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు దిశగా ముడి చమురు నౌకల డైవర్షన్‌కు ప్రాధాన్యమిస్తున్నారు. రష్యా నుంచి ఒక నౌక, కాకినాడ నుంచి రెండు నౌకలు విశాఖ పోర్టుకు రానున్నాయి. ముంద్రా పోర్టుకు ఇతర మార్గాల ద్వారా చమురు నౌకలను రప్పించి, అక్కడి నుంచి విశాఖ పోర్టుకు వాటిని పంపించనున్నారు. 'కేవలం క్రూడ్ ఆయిల్‌పైనే ప్రభావం పడింది. అది కూడా హెచ్‌పిసిఎల్‌కు రావాల్సిన మూడు ట్యాంకర్లే ఆగిపోయాయి' అని అధికారులు చెబుతున్నారు. విశాఖ పోర్టు ఉన్నతాధికారుల తాజా సమాచారం ప్రకారం విశాఖ పోర్టు తూర్పు తీరంలో ఉండడంతో సరుకు రవాణాకు ఆటంకాలేమీ లేవని స్పష్టమవుతోంది. యూరప్ నుంచి మాత్రమే వైజాగ్ పోర్టుకు సరుకు రవాణా నిరంతరం ఉంటుంది. యూరప్ నుంచి 10 లైన్లు సముద్రంలో ఉన్నాయి. యూరప్‌లో యుద్ధం లేనందున ఈ ప్రభావం కార్గోపై పడలేదు. యూరప్, మలేషియా, రష్యా,




ఆస్ట్రేలియా నుంచి చమురు ట్యాంకర్లు వచ్చేలా ఇప్పటికే పోర్టు కార్యాచరణ తీసుకుంది. స్టీల్‌ప్లాంట్‌లో ప్రస్తుతం 120 టన్నుల ఎల్‌పిజి మాత్రమే ఉంది. అది పది రోజులు మాత్రమే సరిపోతుంది. స్టీల్‌ప్లాంట్ మరో 300 టన్నులకు ఇప్పటికే డబ్బులు కట్టి ఉన్నా సరఫరా చేసేందుకు ఆటంకాలు మొదలయ్యాయి. ప్రస్తుతం హెచ్‌పిసిఎల్‌కు ప్రత్యామ్నాయంగా ఎల్‌పిజి స్టోరేజీ పాయింట్ బంగాళాఖాతం మధ్యలో కొండల మధ్య ఉంది. కొన్ని రోజుల మేరకే ఈ నిల్వలు సరిపోతాయని అధికారులు చెబుతున్నారు. యుద్ధం కొనసాగితే నష్టం తీవ్రత పెరగనుంది.

## బిజినెస్

### సెబీ హోల్‌టైమ్ సభ్యుడిగా కె.వి.రమణ మూర్తి



డిఫెన్స్ అకౌంట్స్ అదనపు కంట్రోలర్ జనరల్ కె.వి.రమణ మూర్తి సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ)లో హోల్‌టైమ్ సభ్యుడిగా నియమితులయ్యారు. నియామకాల కమిటీ నుండి అందిన సమాచారం ప్రకారం జాతీయ మీడియా శుక్రవారం ఈ విషయాన్ని వెల్లడించింది. అశ్వని భాటియా స్థానంలో కె.వి.రమణ మూర్తి బాధ్యతలు చేపట్టనున్నారని, ఆయన స్థానంలో మూడేళ్ల పాటు సభ్యుడుగా కొనసాగుతారని పేర్కొంది. సెబీలో అనంత నారాయణ్ మరియు అశ్వని భాటియాలు హోల్ టైమ్ సభ్యులుగా తమ పదవీకాలాన్ని పూర్తి చేసుకున్నారు. అనంత్ నారాయణ్ స్థానంలో ఇటీవల సందీప్ ప్రధాన్ బాధ్యతలు చేపట్టారు. సెబీలో ప్రస్తుతం నలుగురు హోల్‌టైమ్ సభ్యులు, నలుగురు పార్ట్‌టైమ్ సభ్యులు ఉన్నారు. వారిలో ముగ్గురు కార్పోరేట్ వ్యవహారాల శాఖ, ఆర్థిక వ్యవహారాల శాఖ, ఆర్‌బిఐ ప్రతినిధులు.

### వంట నూనెల కొరత..!



అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సామ్రాజ్యవాద చర్యలతో పశ్చిమ ఆసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు భారత వంట నూనెల కొరతకు దారి తీసే సంకేతాలు స్పష్టంగా కనబడుతోన్నాయి. గతేడాదితో పోల్చితే ఫిబ్రవరిలో సన్ ఫ్లవర్ ఆయిల్ దిగుమతులు ఏకంగా 51 శాతం క్షీణించి 1.45 లక్షల టన్నులకు పరిమితమయ్యాయని సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఇఎ) వెల్లడించింది. మరోవైపు అంతర్జాతీయంగా ముడి నూనె ధర టన్నుకు 1,216 డాలర్ల నుండి 1,420 డాలర్లకు ఎగిసింది. ఇది గతేడాది ఫిబ్రవరిలోని ధరలతో పోల్చితే 17 శాతం ఎక్కువ కావడం ఆందోళనకరం. దీనికి తోడు రూపాయి విలువ 4.2 శాతం మేర క్షీణించడం దిగుమతిదారులపై అదనపు ఒత్తిడిని పెంచుతోంది. సరఫరా గొలుసులో తలెత్తిన ఆటంకాల వల్ల మార్కెట్లో సన్ ఫ్లవర్ ఆయిల్ ధరలు సామాన్యుడికి భారంగా మారనున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మార్కెట్లో నిల్వలు తగ్గడం ఆందోళన కలిగిస్తోంది. సమీప భవిష్యత్తులోనే ధరలు పెరిగే అవకాశం లేకపోలేదని స్పష్టమవుతోంది.

### అజిత్‌కు మహీంద్రా అరుదైన కానుక



కోలీవుడ్ స్టార్ హీరో, రేసింగ్ అంటే ప్రాణం ఇచ్చే అజిత్ కుమార్ మరోసారి వార్తల్లో నిలిచారు. మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ దుబాయ్‌లో చిక్కుకుపోయిన ఆయన, ఎట్టకేలకు సురక్షితంగా చెన్నై చేరుకున్నారు. అలాగే ప్రముఖ వాహన తయారీ సంస్థ మహీంద్రా, అజిత్ పట్ల తన గౌరవాన్ని చాటుకుంటూ ఒక ప్రత్యేకమైన కారును బహుమతిగా అందించింది. వివరాల్లోకి వెళితే.. కార్ రేసింగ్‌లో పాల్గొనడానికి దుబాయ్ వెళ్లిన అజిత్, అక్కడ నెలకొన్న భౌగోళిక రాజకీయ పరిస్థితుల కారణంగా కొంతకాలం అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ మృతి, ఇజ్రాయెల్-అమెరికా దాడుల నేపథ్యంలో గల్ఫ్ దేశాల్లో యుద్ధ వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో అజిత్ భద్రత గురించి ఆందోళన చెందిన అభిమానులకు ఆయన మేనేజర్ సురేష్ చంద్ర భరోసా ఇచ్చారు. పరిస్థితులు సద్దుమణిగడంతో అజిత్ సురక్షితంగా చెన్నై చేరుకున్నారు. చెన్నై చేరుకున్న అజిత్‌కు మహీంద్రా సంస్థ ఘన స్వాగతం పలికింది. ఆయనకు రేసింగ్‌పై ఉన్న మక్కువను గుర్తించిన సంస్థ, సరికొత్త 'ఇ 6' ఫార్ములా ఈ-థీమ్ ఎస్యూవీని కానుకగా అందజేసింది. ఈ కారును మహీంద్రా ఆటో విభాగం హెడ్ వేలుస్వామి స్వయంగా అజిత్‌కు అందజేశారు. ఇది ప్రపంచంలోనే మొదటి ఫార్ములా ఈ-థీమ్ ఎస్యూవీ కావడం గమనార్హం. దీని విలువ సుమారు రూ.30 లక్షలు ఉంటుందని యాజమాన్యం చెబుతోంది. ఈ కారు అధికారిక లాంచ్ కార్యక్రమంలో కూడా అజిత్ పాల్గొన్నారు.

### మన చమురు కంపెనీలకు రోజూ రూ.2,000 కోట్ల నష్టం!



ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ ప్రారంభించిన యుద్ధం వల్ల గల్ఫ్ దేశాల నుంచి చమురు ఎగుమతులు ఆగిపోతున్నాయి. ఫలితంగా ముడిచమురు బ్యారెల్ ధర 100 డాలర్లకు చేరింది. యుద్ధం ముందు ఇది సగటున 70 డాలర్లు ఉండేది. భారత్, చైనా నుంచి చమురుకు ఆర్డర్లు లభిస్తుండటంతో, రష్యా పంట పండింది. ముడిచమురు ధరలు పెరిగినా, పెట్రోల్/డీజిల్ రిటెయిల్ ధరలు పెంచనందున.. మన దేశంలోని చమురు మార్కెటింగ్ కంపెనీలకు రోజూ రూ.2,000 కోట్ల నష్టం వస్తోందని కొన్ని అంచనాలు పేర్కొంటున్నాయి. ఇరాన్ యుద్ధం కారణంగా ట్యాంకరు రవాణా ఛార్జీలు, నౌకల బీమా సుంకం పెరగడంతో.. మన చమురు మార్కెటింగ్ కంపెనీ (ఓఎమ్‌సీ)లకు ఆర్థికభారం పడుతోంది. దేశీయంగా రిటెయిల్ ధరలు మార్చనందున లీటరు పెట్రోలుపై రూ.20, డీజిల్‌పై రూ.45 చొప్పున నష్టపోతున్నట్లు సిస్టమాటిక్స్ ఇన్‌స్టిట్యూషనల్ ఈక్విటీస్ తెలిపింది. ఫలితంగా ప్రభుత్వ రంగ ఓఎమ్‌సీలైన భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (బీపీసీఎల్), హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ (హెచ్‌పీసీఎల్), ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీఎల్) కలిపి రోజుకు రూ.2,000 కోట్ల నష్టాన్ని భరిస్తున్నాయని అంచనా వేసింది. ఇందులో డీజిల్‌పైనే రూ.1,650 కోట్ల నష్టం వాటిల్లుతుండగా, పెట్రోలుపై రూ.350 కోట్లు పోగొట్టుకుంటున్నాయి. రష్యా చమురు ధర కూడా బ్రెంట్ ముడిచమురు కంటే బ్యారెల్‌కు 2-8 డాలర్లు ఎక్కువగా ఉందని ఈ సంస్థ పేర్కొంటోంది.

## స్పోర్ట్స్

### వరల్డ్‌కప్‌లో చెత్త ఆటకు 16 లక్షల జరిమానా..

# పాకిస్థాన్ బోర్డు రియాక్షన్ ఇదే!




పొట్టి ప్రపంచకప్ సూపర్ 8 దశలోనే నిష్క్రమించిన పాకిస్థాన్ జట్టుపై స్వదేశంలో తీవ్ర విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. మెగా టోర్నీలో చెత్త ఆట కనబరిచినందుకు స్క్వాడ్‌లోని ఒక్కొకరికి రూ.16 లక్షల జరిమానా విధించారనే వార్తలు వైరలయ్యాయి. అయితే.. ఆ దేశ క్రికెట్ బోర్డు మాత్రం అదేం లేదని అంటోంది. పాక్ ఆటగాళ్లపై జరిమానాపై శనివారం స్పందించిన పీసీబీ అధికార ప్రతినిధి అమిర్ మిర్.. అవన్నీ కట్టుకథలే అని కొట్టిపారేశాడు.

పదో సీజన్ పొట్టి ప్రపంచకప్‌లో పాకిస్థాన్ జట్టు చెత్త ఆటతో సెమీస్‌కు ముందే ఇంటిదారి పట్టింది. సల్మాన్ అఘా సారథ్యంలోని పాక్ చివరి సూపర్ 8 మ్యాచ్‌లో శ్రీలంకపై గెలిచినా గ్రూప్ ఏ నుంచి నిష్క్రమించింది. దాంతో.. పాక్ క్రికెటర్ల ఆటపై స్వదేశంలో ఆగ్రహావేశాలు పెల్లుబికాయి. ఈ నేపథ్యంలో స్క్వాడ్‌లోని 15 మందిపై పాక్ బోర్డు కఠిన చర్యలు తీసుకుందని, ఒక్కొక్కరిపై రూ.16 లక్షల ఫైన్ వేసిందనే కథనాలు వచ్చాయి. కానీ, ఇవేవీ వాస్తవం కాదని ఆ దేశ బోర్డు ఒక ప్రకటన విడుదల చేసింది. 'పాక్ క్రికెటర్లపై జరిమానా విధించారనేది అవాస్తవం. ఇప్పటివరకూ ఒక్కరిపైనా ఫైన్ వేయలేదు. కానీ, ఆటగాళ్ల ప్రదర్శనపై పీసీబీ అసంతృప్తితో ఉంది. బాగా ఆడినప్పుడు వారికి ప్రోత్సాహకాలు అందించాం. ఇప్పుడు చెత్తగా ఆడినందుకు కూడా తగిన పర్యావసానాలు ఉంటాయి. అయితే.. మీడియాలో వస్తున్నట్టు ఎవరిపైనా ఫైన్ మాత్రం వేయలేదు' అని పీసీబీ అధికార ప్రతినిధి అమిర్ మిర్ మీడియాతో పేర్కొన్నాడు.

**భారత్ చేతిలో చిత్తుగా..**

పొట్టి ప్రపంచకప్‌లో లీగ్ దశలో భారత జట్టు చేతిలో చిత్తైన పాకిస్థాన్ సూపర్ 8కు చేరినా.. సెమీస్ గడప తొక్కలేదు. న్యూజిలాండ్‌తో సూపర్ 8 తొలి మ్యాచ్ వర్షార్పణం కావడం.. ఆపై ఇంగ్లండ్ చేతిలో ఓటమి పాక్ అవకాశాల్ని దెబ్బతీశాయి. చావోరేవో పోరులో శ్రీలంకపై భారీ స్కోర్ చేసినా టీమిండియా రన్ రేటును అధిగమించలేక సల్మాన్ అఘా సేన నిష్క్రమించింది.

### రోహిత్ బాటలో రిషబ్ పంత్!




టీమిండియా వికెట్‌కీపర్ రిషబ్ పంత్ ఐపీఎల్ 18వ సీజన్‌లో పాల్గొనేందుకు సమాయత్తమవుతున్నాడు. ఇందులో భాగంగా బరువు తగ్గే పనిలో పడ్డాడు. ఈ క్రమంలోనే ఫిట్‌నెస్‌పై దృష్టి సారించిన పంత్ బరువు తగ్గే విషయమై భారత స్టార్ ఆటగాడు రోహిత్ శర్మను అనుసరిస్తున్నాడు. గతంలో రోహిత్ శర్మ కూడా తన బరువు తగ్గే క్రమంలో కఠినమైన డైట్ పాటించాడు. తాజాగా పంత్ కూడా బరువు తగ్గేందుకు మిత ఆహారం మాత్రమే తీసుకుంటున్నాడు. ఇక పంత్ ఐపీఎల్‌లో లక్నో సూపర్‌జెయింట్స్‌కు కెప్టెన్‌గా ఉన్న సంగతి తెలిసిందే. తాజాగా పంత్ వర్కౌట్స్‌కు సంబంధించిన వీడియోలను, ఫోటోలను లక్నో సూపర్ జెయింట్స్ యాజమాన్యం సోషల్ మీడియాలో షేర్ చేయడంతో వైరల్‌గా మారింది. 'పంత్.. మీరు ఎంత బరువు తగ్గారో చెప్పగలరా?' అని మీడియా ప్రశ్నించింది. అందుకు పంత్ 'ఆ విషయం మాత్రం అడగొద్దు' అంటూ బదులిచ్చాడు. ఒకవైపు గాయాలు, మరోవైపు ఫామ్‌లేమీ పంత్‌ను చాలా ఇబ్బందులకు గురి చేస్తూ వస్తోంది. ఈ నేపథ్యంలో ఐపీఎల్ ద్వారా తిరిగి గాడిలో పడేందుకు టీమిండియా మాజీ డాషింగ్ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ సలహాలు తీసుకున్నాడు. ఈ సందర్భంగా యూవీ పంత్‌కు పలు సలహాలు, బ్యాటింగ్ నైపుణ్యానికి సంబంధించి మెలుకువలు అందించాడు. అయితే గతంలో సంజూ శాంసన్, అభిషేక్ శర్మలు కూడా ఇదే తరహాలో ఫామ్ కోల్పోయినప్పుడు యూవీ ఇలాగే సాయం చేశాడు. 2025 ఐపీఎల్‌లో రూ. 27 కోట్ల రికార్డు ధరకు కొనుగోలు చేసిన లక్నో యాజమాన్యం ఈ ఏడాది అట్టిపెట్టుకున్న సంగతి తెలిసిందే. టీ20 ప్రపంచకప్‌కు ముందు వికెట్‌కీపర్ కమ్ బ్యాటర్ కోసం బీసీసీఐ పంత్‌ను పరిగణలోకి తీసుకుంది.

### ఢిల్లీ క్యాపిటల్స్‌కు షాకిచ్చిన ఇంగ్లండ్ మాజీ కెప్టెన్.. మెంటర్‌గా రాజీనామా!




పంతొమ్మిదో సీజన్ ఆరంభానికి ముందే ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఊహించని షాక్ తగిలింది. గత సీజన్‌లో ఢిల్లీ మెంటర్‌గా సేవలందించిన కెవిన్ పీటర్సన్ బైబై చెప్పేశాడు. తాను ఢిల్లీ మెంటర్‌గా వైదొలుగుతున్నట్టు శనివారం వెల్లడించాడీ ఇంగ్లండ్ మాజీ కెప్టెన్. ఫ్రాంచైజీ ఆశించినట్టుగా తాను ఈసారి పూర్తి సమయం కేటాయించకపోవచ్చని ఈ నిర్ణయం తీసుకున్నట్టు పీటర్సన్ వెల్లడించాడు. ఐపీఎల్ షెడ్యూల్ ప్రకటనతో జోరు పెంచాలనుకున్న ఢిల్లీ క్యాపిటల్స్ మెంటర్ కెవిన్ పీటర్సన్ సేవల్ని కోల్పోనుంది. ఈసారి పక్కా ప్లాన్‌తో కప్ కొట్టాలనుకున్న ఢిల్లీకి షాకిస్తూ అతడు బాధ్యతల నుంచి వైదొలిగాడు. అయితే.. మెంటర్‌గా ఉండడం కంటే కామెంటేటర్‌గా వ్యవహరించడమే మంచిదని భావిస్తున్నట్టు చెప్పాడీ వెటరన్. ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకున్నాడిలా. 'ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్‌లో నేను ఢిల్లీ క్యాపిటల్స్ మెంటర్‌గా కొనసాగడం లేదు. మెంటర్‌గా పూర్తి బాధ్యతగా పని చేసేందుకు అవసరమైన సమయాన్ని నేను కేటాయించలేను. కొత్త సీజన్‌లో ఆటగాళ్లు మెరుగైన ప్రదర్శన చేయాలని కోరుకుంటున్నా. మెంటర్‌గా కొనసాగకున్నా.. నన్ను మీకు కామెంటరీ బాక్స్‌లో చూడొచ్చు. ప్రపంచంలోని టీ20 లీగ్స్‌లో ఐపీఎల్ ఉత్తమమైనది. సో.. మీ అందర్నీ త్వరలోనే చూసేందుకు నేను ఎదురుచూస్తున్నా' అని పీటర్సన్ తన పోస్ట్‌లో పేర్కొన్నాడు. ఐపీఎల్ 18వ సీజన్ ముందు మెంటర్‌గా ఢిల్లీ కోచింగ్ యూనిట్‌లో చేరిన పీటర్సన్.. ఏడాది కాలానికే బాధ్యతల నుంచి వైదొలిగాడు. 19వ సీజ తొలి మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌తో ఢిల్లీ తలపడనుంది




# ఎక్కడో కొడుతుందన్నా.. స్క్రిప్ట్ అంతా మార్చేశారు

తెలుగులో తొలి సినిమా 'ఊహలు గుసుగుసలాడె'తో గుర్తింపు తెచ్చుకుంది రాశీ ఖన్నా. జోరు, సుప్రీం, జై లవకుశ, తొలి ప్రేమ, వెంకీమామ, ప్రతిరోజు పండగే ఇలా అనేక సినిమాలు చేసింది. తెలుగులోనే కాకుండా తమిళ, మలయాళ, హిందీ భాషల్లోనూ మూవీస్ చేసింది. చివరగా తెలుగులో తెలుసు కదా మూవీతో అలరించింది. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాలో యాక్ట్ చేస్తోంది. ఈ చిత్రం మార్చి 19న విడుదల కానుంది. సినిమా రిజల్ట్ ముందే ఊహించిన రాశీ ఈ మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూకి హాజరైన రాశీ ఖన్నా తెలుసు కదా సినిమా వైఫల్యాన్ని ముందే ఊహించానంది. ఆమె మాట్లాడుతూ.. తెలుసు కదా షూటింగ్ జరుగుతున్న సమయంలో నాకు నచ్చని పాయింట్స్ అన్నీ చెప్పాను. కొన్ని సీన్స్ చిత్రీకరించేటప్పుడు ఇదెందుకో నాకు కరెక్ట్ కాదనిపిస్తుందన్నాను. అదే సమయంలో ఇది దర్శకుడి విజన్ అని గౌరవించాను.

అదే నేర్చుకున్నా

కానీ, షూట్ చేసేటప్పుడు చాలాసార్లు చెప్పాను.. ఇదెక్కడో కొడుతోంది, క్లైమాక్స్ కూడా అందరూ ఒప్పుకునేలా ఉండాలి, కాబట్టి ఆపరేషన్ సీన్ చేయనన్నాను. చివరకు తప్పలేదు. అయినా ఈ సినిమా ద్వారా అందరూ ఏదో ఒక గుణపాఠం నేర్చుకున్నారు. అలా నేను కూడా నా అభిప్రాయాన్ని మరింత గట్టిగా చెప్పాల్సింది అని తెలుసుకున్నాను. ఆ మూవీ షూట్ చేస్తున్నకొద్దీ స్క్రిప్ట్ చాలా మారిపోయింది. నా చేతుల్లో ఏం లేదు అని రాశీ ఖన్నా చెప్పుకొచ్చింది.



# 'రాకాస' నుంచి 'పదే పదే' మెలోడీ సాంగ్ రిలీజ్

మెగా వారసురాలు నిహారిక కొణిదెల నిర్మాతగా మొదటి చిత్రం 'కమిటీ కుర్రోళ్లు'తోనే బ్లాక్ బస్టర్ హిట్ సొంతం చేసుకుని.. ఎన్నో అవార్డుల్ని, రివార్డుల్ని అందుకుంది.అలాంటి ఓ అద్భుతమైన సినిమా తరువాత జీ స్టూడియోస్ సమర్పణలో నిహారిక తన పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మాతగా ఉమేష్ కుమార్ బన్సాల్‌తో కలిసి 'రాకాస' మూవీని నిర్మించారు. సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా నటించిన ఈ సినిమాను మానస శర్మ తెరకెక్కించాడు. సమ్మర్ స్పెషల్‌గా ఈ చిత్రం ఏప్రిల్ 3న రిలీజ్ చేయబోతోన్నారు. దీంతో అప్పుడే ప్రమోషన్స్ స్టార్ట్ చేసిన చిత్ర బృందం.. ప్రమోషనల్ కంటెంట్, గ్లింప్స్, టీజర్, సాంగ్ అన్నిటితో సినిమాపై జనాల్లో క్యూరియాసిటీని పెంచారు. ప్రస్తుతం మ్యూజికల్ ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్న టీమ్.. తాజాగా 'పదే పదే' అంటూ సాగే ఓ మెలోడీ సాంగ్‌ను తాజాగా రిలీజ్ చేసింది. ఈ లిరికల్ వీడియో సాంగ్‌ని చూస్తుంటే హీరో మీద హీరోయిన్‌కి ఉన్న ప్రేమ, వన్ సైడ్ లవ్ స్టోరీ కనిపిస్తోంది. హీరో, హీరోయిన్ల కెమిస్ట్రీ, వారి ప్రేమను చాటేలా సాంగ్ సాగింది. ఇక గ్రామీణ వాతావరణంలో చిత్రీకరించిన ఈ పాటలోని విజువల్స్ మనసుని హత్తుకునేలా ఉన్నాయి. 'పదే పదే ప్రాణం నిన్నే కోరగా.. కలే నిజం కాదా నిన్ను చేరగా.. ఒకే ఒక ఆశ చాలుగా నువ్వే చాలుగా.. ప్రపంచమే లేదే ప్రతీ క్షణం నువ్వే నా కథ' అంటూ సాగే ఈ సాంగ్ ప్రజెంట్ నెట్టింట వైరల్ అవుతున్నది.

# రాజేంద్రప్రసాద్ గారు మీరు గ్రేట్

టాలీవుడ్ సీనియర్ నటుడు రాజేంద్రప్రసాద్, తమిళ దిగ్గజ నటుడు ఎంజీఆర్ మధ్య తలెత్తిన వివాదం ఎట్టకేలకు సుఖాంతమైంది. ఇటీవల ఒక అవార్డు వేడుకలో రాజేంద్రప్రసాద్ చేసిన వ్యాఖ్యలు కోలీవుడ్‌లో పెద్ద దుమారాన్నే రేపాయి. అయితే, దీనిపై రాజేంద్ర ప్రసాద్ వెంటనే స్పందించి క్షమాపణలు చెప్పడంతో, తమిళ నటుడు, 'నడిగర్ సంగం' ప్రధాన కార్యదర్శి విశాల్ ఆయనను అభినందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాజేంద్ర ప్రసాద్ క్షమాపణలు చెబుతూ వీడియో విడుదల చేసిన తర్వాత విశాల్ ఒక ప్రకటన చేశారు. "నమస్తే రాజేంద్ర ప్రసాద్ గారు, మీరు క్షమాపణలు చెప్పినందుకు చాలా థాంక్స్. ఎంజీఆర్ గారిపై మీరు చేసిన వ్యాఖ్యలు విన్న తర్వాత కేవలం మా జనరేషన్ మాత్రమే కాదు, ఆయనతో కలిసి ప్రయాణించిన ఎంతోమంది సీనియర్లు కూడా చాలా బాధపడ్డారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆయన అభిమానుల సెంటిమెంట్స్ దెబ్బతిన్నాయి. అందుకే మేము 'సౌత్ ఇండియన్ ఆర్టిస్ట్ అసోసియేషన్' తరపున మిమ్మల్ని క్షమాపణలు కోరాలని రిక్వెస్ట్ చేశాం" అని విశాల్ తెలిపారు. రాజేంద్ర ప్రసాద్ పెద్ద మనసును అభినందిస్తూ విశాల్ మరికొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. "పెద్దరికాన్ని ప్రదర్శిస్తూ, జరిగిన తప్పును వెంటనే అంగీకరించి అపాలజీ చెప్పడం నిజంగా గ్రేట్ సార్. రేపు మీలాంటి పెద్ద నటుల గురించి ఎవరైనా తప్పుగా మాట్లాడినా మేము ఇలాగే స్పందిస్తాం. మా రిక్వెస్ట్‌ను గౌరవించి వివాదానికి ముగింపు పలికినందుకు మీకు ప్రత్యేక ధన్యవాదాలు. మీరు నిజంగా గొప్ప మనిషి" అంటూ విశాల్ గౌరవాన్ని చాటుకున్నారు. దీంతో గత కొద్దిరోజులుగా ఇరు పరిశ్రమల మధ్య సాగుతున్న ఈ వివాదానికి తెరపడినట్లయింది.



# కొత్త సినిమాకు హెబ్బా పటేల్ గ్రీన్ సిగ్నల్.. ఇంతకీ జోనర్ ఏంటో తెలుసా?

తెలుగు ప్రేక్షకులకు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని భామ హెబ్బా పటేల్ (ఎవమ్షుష్ట్రాఫ్వశ్రీ ). గ్లామరస్ పాత్రలతో, నటనకు ఆస్కారమున్న కథలతో ప్రేక్షకులను పలుకరిస్తూ మంచి ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది. కుమారి 21ఎఫ్, ఓదెల రైల్వే స్టేషన్, హనీమూన్ ఎక్స్‌ప్రెస్ సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్నఈ ముద్దుగుమ్మ చాలా కాలంగా సరైన బ్రేక్ కోసం ఎదురుచూస్తుంది. ఈ బ్యూటీ తాజాగా చిత్రాలయ క్రియేషన్స్ బ్యానర్‌పై ఓ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రొడక్షన్ నంబర్ 3గా రాబోతున్న ఈ చిత్రానికి దర్జా ఫేం మ్యాక్ (సలీం మాలిక్)దర్శకత్వం వహిస్తున్నాడు. మ్యాక్ కథ, స్క్రీన్‌ప్లే కూడా సమకూరుస్తున్నాడు. ఎమోషనల్, కామెడీ జోనర్‌లో రాబోతున్న ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నారు. శ్రీలక్ష్మి ఎం నిర్మిస్తున్న ఈ చిత్రానికి కేవీఆర్ అడిషనల్ స్క్రీన్ ప్లే అందిస్తుండగా.. ఎం సమీర్ మ్యూజిక్ అందిస్తున్నాడు. ఈ మూవీకి భాష్య శ్రీ మాటలు, పాటలు సమకూరుస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలపై త్వరలోనే క్లారిటీ ఇవ్వనుంది హెబ్బా పటేల్ టీం. హిట్టు, ఫ్లాపులతో సంబంధం లేకుండా బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో దూసుకెళ్తున్న హెబ్బా పటేల్ ఈ సారి సిల్వర్ స్క్రీన్‌పై ఎలాంటి మ్యాజిక్ చేయబోతున్నది ఆసక్తికరంగా మారింది.





# జోరు పెంచిన సిద్ధు జొన్నలగడ్డ..

'డీజే టిల్లు'తో టాలీవుడ్‌లో ఫుల్ క్రేజ్ సొంతం చేసుకున్నాడు స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ. తనదైన మేనరిజమ్, డైలాగ్ డెలివరీతో సరికొత్త ట్రెండ్‌ను సెట్ చేసి బ్లాక్ బస్టర్ హిట్‌ను సొంతం చేసుకున్నాడు.దీనికి సీక్వెల్‌గా వచ్చిన 'టిల్లు స్క్వేర్' మొదటి భాగం అంత హిట్ సొంతం చేసుకోలేదు. తర్వాత 'తెలుసు కదా' మూవీతో వచ్చినప్పటికీ ఆశించిన స్థాయిలో మెప్పించలేకపోయాడు. ఇప్పుడు సరైన బ్రేక్ కోసం ఎదురు చూస్తున్న సిద్ధు.. తన లైనప్‌ను పూర్తిగా మార్చేసి మూడు భారీ ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశాడు. ఈ మేరకు 'ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ'తో సెన్సేషన్ క్రియేట్ చేసిన డైరెక్టర్ స్వరూప్ ఆర్ఎస్‌జేతో చేతులు కలిపాడు. సితార ఎంటర్‌టైన్మెంట్ బ్యానర్‌పై తెరకెక్కుతోన్న ఈ చిత్రం క్రైమ్ అండ్ కామెడీ ఎంటర్‌టైనింగ్‌గా ఉండబోతుందని తెలుస్తుంది. దీంతో పాటు సరికొత్త జానర్ సోషియో ఫాంటసీ బ్యాక్ డ్రాప్‌లో ఓ చిత్రం చేస్తున్నాడు. ఇది గ్రాఫిక్స్, విజువల్ వండర్‌గా ఉండేలా ప్లాన్ చేస్తున్నారట మేకర్స్. అలాగే ప్రస్తుతం రవికాంత్ పేరేపు దర్శకత్వంలో 'బాడాస్' అనే ఇంటెన్స్ ఎమోషనల్ డ్రామాలో కూడా నటిస్తున్నాడు. ఇక టిల్లు క్యూబ్ పనులు కూడా ప్రస్తుతం జరుగుతున్నట్లు తెలుస్తుండగా.. సిద్ధు లైనప్‌తో ఫ్యాన్స్ ఫుల్ ఖుష్ అవుతున్నారు.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com